ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 166 | సోమవారం 16 మార్చి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



# కేంద్రం నుండి పోలవరానికి నిధుల వరద

- అడ్వాన్స్‌గా రూ.1508 కోట్లు విడుదల చేసిన కేంద్రం...
- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూల స్పందన..
- మార్చి 15లోపు ఖర్చు చేస్తే మిగిలిన నిధుల విడుదలకు హామీ..
- సింగిల్ నోడల్ ఖాతా నుంచి పోలవరం ఖాతాకు నిధుల బదిలీ..
- నిర్మాణ పనుల కోసం రూ.500 కోట్లు కేటాయింపు..
- పునరావాస కార్యక్రమాలకు మరో రూ.500 కోట్లు వినియోగం..
- ఇతర అవసరాల కోసం రూ.508 కోట్లు ఖర్చు..
- ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భారీగా నిధుల విడుదల

**అమరావతి (తెలుగోడు), మార్చి 15 :**
ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు మరోసారి కేంద్రం నుంచి కీలక ఆర్థిక సహాయం పొందింది. ప్రాజెక్టు పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం అడ్వాన్స్ నిధుల రూపంలో రూ.1508 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు విడుదల కావడంతో పోలవరం నిర్మాణ పనులకు కొంత ఊరట లభించినట్లైంది.పోలవరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద బహుళ ప్రయోజనాల నీటిపారుదల ప్రాజెక్టులలో ఒకటిగా గుర్తింపు పొందింది. గోదావరి నదిపై నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక ప్రయోజనాలు కలుగనున్నాయి. అయితే సాంకేతిక సమస్యలు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాల కారణంగా పనులు అనేకసార్లు ఆలస్యమవుతూ వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వచ్చిన తాజా నిధుల విడుదల ప్రాజెక్టు పురోగతికి ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు మొత్తం రూ.5936 కోట్లు కేటాయించారు. అయితే గత బడ్జెట్ తర్వాత అడ్వాన్స్‌గా విడుదల చేసిన నిధులు ఇప్పటికే వినియోగించబడటంతో ఆ మొత్తాన్ని సవరించి రూ.3017 కోట్లుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయాల్సిన నిధుల్లో భాగంగా అడ్వాన్స్‌గా కొంత మొత్తం ఇప్పుడే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. రాష్ట్రం చేసిన ఈ విజ్ఞప్తిని కేంద్రం అంగీకరించి రూ.1508 కోట్లు విడుదల చేసింది.కేంద్రం మరో కీలక షరతును కూడా పేర్కొంది. విడుదల చేసిన ఈ రూ.1508 కోట్లను మార్చి

2లో

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు

# పిల్లల హంతకుడు

బతికే ఉన్నా వెంబడించి చంపుతామని ఇరాన్ విప్లవ గార్డులు హెచ్చరిక

'సెపా' వెబ్‌సైట్‌లో ప్రచురితమైన విప్లవ గార్డుల ప్రకటన

**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 15 :**
ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు హత్యకు గురయ్యారనే వదంతులు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ ప్రచారాల మధ్య ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ విప్లవ గార్డుల దళం తీవ్ర వ్యాఖ్యలు చేయడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విడుదల చేసిన ప్రకటనలో నెతన్యాహును "పిల్లల హంతకుడు"గా అభివర్ణిస్తూ అతను బతికే ఉన్నా కూడా వెంబడించి చంపుతామని హెచ్చరించారు. ఈ ప్రకటన గార్డులు



2లో

# ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు



జాతీయ రాజకీయాల్లో అసలైన సమరానికి శ్రీకారం

తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో పోలింగ్

రెండు నుంచి ఆరు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం

**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 15 :**
జాతీయ రాజకీయాల్లో అసలైన సమరానికి ముహూర్తం ఖరారైంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ రాష్ట్రాల్లో పర్యటించిన ఎన్నికల సంఘం బృందాలు అక్కడి ఏర్పాట్లను సమీక్షించాయి. భద్రత, సిబ్బంది ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల సన్నాహకాలు పరిశీలించిన తరువాత ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఎన్నికలు జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి. మూడోసారి (మిగతా 2లో)

తమిళనాడు ఎన్నికలపై

# కేంద్రం దృష్టి

- ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీకి పోలింగ్..
- మే 4న ఫలితాలు... రాజకీయంగా కీలక పోరు..
- సినీనటుడు విజయ్ పార్టీపై బిజెపి ప్రత్యేక దృష్టి..
- మొత్తం 234 స్థానాల కోసం ప్రధాన పార్టీల పోటీ..
- ఎన్నికల ప్రకటనతో అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళి..



**చెన్నై (తెలుగోడు), మార్చి 15 :**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీకి పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 234 అసెంబ్లీ స్థానాల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు (మిగతా 2లో)

# లోక్ అదాలత్‌లో 2.84 కోట్ల కేసులకు ముగింపు

దేశవ్యాప్తంగా నిర్వహించిన తొలి జాతీయ లోక్ అదాలత్‌లో భారీ స్పందన..

రూ.10,920 కోట్ల విలువైన వివాదాలకు తెర

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 15 :**
2026 సంవత్సరానికి గాను తొలిసారిగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో కేసులు పరిష్కరించబడ్డాయి. ఒకే రోజులో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 2,84,14,329 కేసులకు పరిష్కారం లభించింది. ఈ కేసుల పరిష్కారాల ద్వారా సుమారు రూ.10,920 కోట్ల విలువైన వివాదాలు ముగిసినట్లు న్యాయ సేవా సంస్థలు వెల్లడించాయి. శనివారం దేశమంతటా ఒకేసారి నిర్వహించిన ఈ కార్యక్రమం న్యాయ వ్యవస్థలో వేగవంతమైన పరిష్కారాలకు మంచి ఉదాహరణగా నిలిచింది.పరిష్కరించబడిన కేసుల్లో ఎక్కువ భాగం కోర్టుకు వెళ్లకముందే పరిష్కరించగలిగిన వివాదాలే. మొత్తం కేసుల్లో 2,57,82,254 కేసులు ప్రాథమిక దశలోనే ముగిశాయి. మరో 26,32,075 కేసులు ఇప్పటికే కోర్టుల్లో పెండింగ్‌లో (మిగతా 2లో)

ఉగాదికి ముందే నిరుపేదలకు

# సొంతింటి కల సాకారం

- నాయుడుపేట వద్ద 2064 టిడ్కో ఇళ్ల పంపిణీకి సిద్ధం..
- మార్చి 17న ముఖ్యమంత్రి సిఎం చేతుల మీదుగా గృహప్రవేశాలు..
- రూ.168 కోట్ల వ్యయంతో నిర్మితమైన భారీ గృహ సముదాయం..
- ఉగాది పండుగకు ముందు లబ్ధిదారుల్లో ఆనందం..

**అమరావతి (తెలుగోడు), మార్చి 15 :**
రాష్ట్రంలో ఉగాది పండుగకు ముందు నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కూటమి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. తిరుపతి జిల్లాలోని నాయుడుపేట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి 17వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 2064 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. మొత్తం రూ.168 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన ఈ గృహ సముదాయం వందలాది



2లో

ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను

# సస్పెండ్ చేయాలి

పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల

**విజయవాడ (తెలుగోడు), మార్చి 15 :**
హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనలో డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో అధికార పార్టీకి చెందిన ఎంపీ దొరకడం సిగ్గుచేటని ఆమె తీవ్రంగా విమర్శించారు.దేశ రాజధాని ఢిల్లీలో (మిగతా 2లో)



డ్రగ్స్ వద్దు బ్రో అని ప్రచారం చేస్తారు

# మీరే డ్రగ్స్ తీసుకుంటారు

- చెప్పేది శ్రీరంగ నీతులు... చేసేవి పనికిమాలిన పనులు..
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కేవలం మాటలకు మాత్రమే పరిమితమా..?
- చంద్రబాబు నీతులు ఏమయ్యాయి..
- పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి...



**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 15 :**
డ్రగ్స్ వద్దుబ్రో అంటూ ప్రచారం చేస్తున్న టీడీపీలోని ప్రజాప్రతినిధులే డ్రగ్స్ తీసుకుంటూ తప్పుడు పనులు చేస్తున్నారు. ఇదెక్కడి చోద్యం అంటూ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ పార్టీలో దొరికిన ఘటనపై దుద్దుకంట తీవ్రంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ, టీడీపీ నాయకులు కానీ స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. తెల్లవారు లేస్తే నీతులు చెప్పే చంద్రబాబు ఈ ఘటనపై ఏమి చెబుతారో ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. టీడీపీ ఇప్పుడు తెలుగు డ్రగ్స్ పార్టీగా మారిందన్న అనుమానం ప్రజల్లో కలుగుతోందని దుద్దుకుంట వ్యాఖ్యానించారు. డ్రగ్స్ రహిత సమాజం సృష్టించాలని మంత్రి లోకేష్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారని, డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఉద్యమంలా ప్రచారం చేశారని గుర్తుచేశారు. ప్రజలకు డ్రగ్స్ వద్దని చెబుతున్న నేతలు తమ పార్టీలో ఉన్నవారు డ్రగ్స్ తీసుకుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎదుటివారికి నీతులు చెప్పే టీడీపీ నేతలు తమవారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని దుద్దుకుంట విమర్శించారు. ఒకవైపు మహిళలతో రాసలీలల వివాదాలు, మరోవైపు డ్రగ్స్ కేసులు బయటపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని అన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలిస్తామని హోంమంత్రి అనిత ప్రకటించిన పది రోజుల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాలో గంజాయి పట్టుబడిన ఘటన జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇది ప్రభుత్వ (మిగతా 2లో)

నేటి నుంచి

# రైతన్న మీకోసం

రైతు సమస్యలను తీర్చే లక్ష్యంతో ప్రభుత్వ చర్యలు..

ప్రత్తిపాడు నుంచి కార్యక్రమానికి శ్రీకారం..



**అమరావతి (తెలుగోడు), మార్చి 15 :**
రాష్ట్రంలో రైతాంగ సంక్షేమం కోసం రైతులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించింది. మార్చి 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వ్యవసాయ అభివృద్ధికి దోహదపడే పంచ సూత్రాలతో పాటు అగ్రి టెక్, డీప్ టెక్ ఆధారిత ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంగా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు (మిగతా 2లో)

అధికార పార్టీపై డ్రగ్స్ మచ్చ

# తెలుగు డ్రగ్స్ పార్టీ అంటూ విమర్శలు

- డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపీ పేరు బయటకు రావడంతో రాజకీయ కలకలం..
- రక్త నమూనాల్లో పాజిటివ్ రావడంతో వివాదం..
- అధికార పార్టీ ప్రజాప్రతినిధి వ్యవహారంపై తీవ్ర విమర్శలు..
- పార్టీ నుంచి బహిష్కరించాలని వైసీపీ నేతల తీవ్ర వ్యాఖ్యలు..
- ఘటనను సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు..

**అమరావతి (తెలుగోడు), మార్చి 15 :**


మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ పార్టీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఉండడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. మొదట తీసుకున్న మూత్ర నమూనాల్లో డ్రగ్స్ నెగిటివ్ వచ్చినప్పటికీ, రక్త నమూనాల్లో డ్రగ్స్ పాజిటివ్ రావడం వివాదాన్ని మరింత రగిలించింది. అధికార పార్టీకి చెందిన ఎంపీ పేరు ఈ కేసులో బయటకు రావడంతో రాజకీయంగా పెద్ద దుమారం రేగింది.ఇప్పటికే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై వివిధ అంశాలపై విమర్శలు (మిగతా 2లో)

## సస్పెండ్ చేయాలి

(మొదటి పేజీ (తరువాయి)

పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రజలను ప్రతినిధ్యం వహించాల్సిన ఎంపీ ఇక్కడ కొకైన్‌తో విందు చిందు చేస్తున్నాడని వైఎస్ షర్మిల ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి చర్యలకు పాల్పడటం తీవ్ర బాధ్యతారాహిత్యమని ఆమె అన్నారు. డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి చర్యలు తీసుకుంటారో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ప్రజాప్రతినిధి సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నాడని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. యువత డ్రగ్స్ వాడాలని ప్రోత్సహిస్తున్నారా అనే సందేహాలు ప్రజల్లో కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఓట్లేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు.

ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చతెస్తాయని పేర్కొన్న వైఎస్ షర్మిల, వెంటనే ఎంపీ పదవి నుంచి పుట్టా మహేష్ యాదవ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ కూడా ఆయనపై తక్షణమే సస్పెన్షన్ విధించాలని కోరారు. డ్రగ్స్‌పై నిజంగా ఉక్కుపాదం మోపాలంటే ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎంపీపై చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతుందని అన్నారు. మొయినాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఏర్పాటు చేసిన పార్టీలో పాల్గొన్న పుట్టా మహేష్ యాదవ్‌కు తొలుత ర్యాండమ్ టెస్ట్ నిర్వహించగా నెగెటివ్ వచ్చినట్లు సమాచారం. అయితే తర్వాత నిర్వహించిన రక్త పరీక్షలో మాత్రం డ్రగ్స్‌కు సంబంధించిన ఆనవాళ్లు పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ పరిణామంతో ఈ వ్యవహారం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీస్తూ అధికార తెలుగుదేశం పార్టీకి తలనొప్పిగా మారింది.

## ఉగాదికి ముందే పేదల సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ (తరువాయి)

కుటుంబాలకు సురక్షితమైన నివాసాన్ని అందించనుంది. జాతీయ రహదారి 16కు ఆనుకొని నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని బిరదవాడ సమీపంలో ఈ గృహ సముదాయం నిర్మించబడింది. ఉగాది పండుగను పురస్కరించుకొని లబ్ధిదారులకు గృహప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా అధికారులు ఈ ఇళ్లను అన్ని వసతులతో నివాసయోగ్యంగా సిద్ధం చేశారు. తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేశారు.గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నాయుడుపేటలో 36 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దాదాపు 70 శాతం వరకు పనులు పూర్తయిన తర్వాత గత ప్రభుత్వ కాలంలో అవి నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిపోయిన టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించింది.ఇళ్ల పంపిణీతో వేలాది కుటుంబాల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసింది. చాలా కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తూ నిరాశలో ఉన్న కుటుంబాలకు ఇప్పుడు గృహప్రవేశం చేసే అవకాశం లభించడం ఆనందాన్ని కలిగిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టిందని ప్రజలు పేర్కొంటున్నారు.తెలుగువారి సంవత్సరాది అయిన ఉగాది పండుగకు ముందే నిరుపేద కుటుంబాలు తమ సొంత ఇంటి గడప తొక్కబోతుండడం వారికి ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ గృహ పంపిణీని ఉగాది కానుకగా భావిస్తూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. పేదల సొంతింటి కలను నిజం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇళ్ల పంపిణీతో లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలు, వెలుగులు నిండనున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## మీరే డ్రగ్స్ తీసుకుంటారు..

(మొదటి పేజీ (తరువాయి)

వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.రాష్ట్రంలో పోలీసులు ప్రజల భద్రతపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో తప్పుడు కేసులు కట్టడంలో బిజీగా ఉన్నారని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలేసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.టీడీపీకి చెందిన ఎంపీ డ్రగ్స్ కేసులో దొరికితే పార్టీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కూటమి ఎమ్మెల్యేల వివాదాలు, తరువాత టీవీ5 చైర్మన్ వ్యవహారం, ఇప్పుడు ఏలూరు ఎంపీ ఘటన వరుసగా వెలుగులోకి రావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని దుద్దుకుంట తీవ్ర విమర్శలు గుప్పించారు.

## తమిళనాడు ఎన్నికలపై కేంద్రం దృష్టి

(మొదటి పేజీ (తరువాయి)

పోటీపడనున్నాయి. పోలింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. సాధారణంగా కేరళతో కలిసి ఒకే దశలో తమిళనాడు ఎన్నికలు జరుగుతుంటాయి. ఈసారి మాత్రం కేరళలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, తమిళనాడులో రెండు వారాల తర్వాత ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.ఈ రెండు వారాల గడువులో తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా పార్టీల మధ్య పొత్తులపై చర్చలు ముమ్మరం కావచ్చని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఉన్నాయనే చర్చలు కూడా సాగుతున్నాయి.ఈ నేపథ్యంలో తమిళ సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీపై కూడా ప్రత్యేక దృష్టి నెలకొంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పార్టీ ప్రభావం ఎలా ఉంటుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బిజెపి ఈ పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం టీవీకే పార్టీతో పొత్తు కుదిరితే కీలక రాజకీయ మార్పులు చోటు చేసుకునే అవకాశముందని భావిస్తున్నారు. ఈ కూటమి సాధ్యమైతే తమిళనాడు ఎన్నికల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఎన్నికల ప్రకటనతో రాష్ట్రంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వాలు కొత్త పథకాలు ప్రకటించడం, ఓటర్లను ప్రభావితం చేసే ఆర్థిక హామీలు ఇవ్వడం నిషేధం అవుతుంది. ప్రచారం వేగం పుంజుకునే కొద్దీ తమిళనాడు రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశముంది.

## రాష్ట్రాల మధ్య సంస్కృతి సంప్రదాయాలను

# ప్రోత్సహించేందుకే సమ్మేళనాలు

### జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం..

**అమరావతి, మార్చి 15**

రాష్ట్రాల మధ్య సంస్కృతి సంప్రదాయాలు విలువల పరస్పర మార్పిడిని ప్రోత్సహించేందుకు అంతర్రాష్ట్ర యువజన మార్పిడి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు మై భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి అన్నారు.కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో,మై భారత్ కేంద్రం గుంటూరు నిర్వహిస్తున్న అంతర రాష్ట్ర యువజన మార్పిడి సమ్మేళనం రెండో దశ కార్యక్రమంలో క్షేత్ర దర్శనలో భాగంగా ఆదివారం ఉండవల్లి గుహలు, అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయాన్ని,ధ్యాన బుద్ధ, మ్యూజియాన్ని త్రిపుర రాష్ట్రం నుండి 37 మంది యువతి–యువకులు సందర్శించారు.ఈ కార్యక్రమం లో భాగంగా అమరావతిలోని జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాల గురించి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి బెన్నిబాబు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనచైతన్య సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనచైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గుంటూరు జిల్లా మై భారత్ ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి ని ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో కోలాటం మాస్టారు



మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తుళ్ళూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అమరావతి మండలంలోని పొందుగల గ్రామ మురళి కృష్ణ కోలాట బృందం కోలాట ప్రదర్శన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఆఫీసర్ జయరావు,జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, బెజ్జం నాగేశ్వరరావు,రాణి,త్రివేణి, తదితరులు పాల్గొన్నారు. కోలాటం ప్రదర్శించిన బృందానికి ఈసందర్భంగా ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు.





మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

# అమరావతిలో అమరజీవి భారీ విగ్రహం

### 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు.. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు..

**అమరావతి, మార్చి 15:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అమరావతి, విజయవాడలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ, మరోవైపు రంజాన్ పవిత్రతను చాటుతూ ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇచ్చే ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొననున్నారు. ఉదయం 11:15 గంటలకు అమరావతిలో శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. అమరజీవి త్యాగానికి స్ఫూర్తిగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని రూ.150 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 6.80 ఎకరాల స్థలంలో



మొదటి దశ పనులు పూర్తి అయ్యాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం 6 నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను ఉపయోగించారు. రెండో దశలో ఇక్కడ మ్యూజియం, ఫోటో గ్యాలరీ, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మించనున్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు పోరాడిన శ్రీరాములు త్యాగాన్ని చాటిచెప్పేలా ఈ స్మృతివనాన్ని తీర్చిదిద్దనున్నారు. సాయంత్రం 05:40 గంటలకు విజయవాడ చేరుకుని ముస్లిం సోదరుల గౌరవార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీలకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారితో కలిసి ఆయన ఇఫ్తార్ విందు స్వీకరిస్తారు.

# ప్రేమ తత్వమే విశ్వశాంతికి మూలం

### 25వ రోజు రంజాన్ ఇఫ్తార్ విందు..

**విజయనగరం, మార్చి 15:**

"ప్రేమతత్వమే – విశ్వశాంతికి మూలం..!" అని సూఫీ అభిషిక్తులు, ఖాదర్ వలి దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్ బాబు) ఉద్బోధించారు. ఏ ఉపవాస దీక్షల్లోనైనా దాగి ఉన్న అర్థం, పరమార్థం ఇదేనని అన్నారు. సాటి మనిషిని ప్రేమించిన చోట ద్వేషానికి, విద్వేషానికి తావుండదని అన్నారు. పట్టణంలోని బాబామెట్ట హజరత్ ఖాదర్ వలి మహాత్మ దర్బార్ లో ఆదివారం సాయంత్రం 25వ రోజు ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖాదర్ బాబా వారి ప్రేమాస్పదులు ప్రముఖ సామాజిక సేవకుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అవనాపు విక్రమ్ బాబు తన కుమార్తె హరిణి, సన్నిహితులతో కలిసి ఈ ఇఫ్తార్ విందుకు విచ్చేశారు. ఖలీల్ బాబు, అహమ్మద్ బాబుతో కలిసి విక్రమ్ బాబు, వారి కుమార్తె హరిణి ఉపవాస దీక్షలకు ఆత్మీయంగా తమ చేతుల మీదుగా ఇఫ్తార్ అందించారు. ఈ సందర్భంగా విక్రమ్ బాబు కుమార్తెతో కలిసి ఇఫ్తార్ విందుకు విచ్చేయడం సంతోషాన్ని కలిగించిందని ఖలీల్ బాబు అన్నారు. స్వర్గీయ అవనాపు సూరిబాబు వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ తమ మానవత్వాన్ని చాటుకుంటూ విజయనగర ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారని, ఖాదర్ బాబా కరుణ కృపా వారిపై



ఉండాలని ఖలీల్ బాబు ఆకాంక్షించారు. విక్రమ్ బాబు మాట్లాడుతూ ఖాదర్ బాబా వారి సన్నిధిలో నిర్విరామ అన్నసమారాధనతో పాటు, రంజాన్ ప్రత్యేక దినాల్లో అనునిత్యం ఇఫ్తార్ నిర్వించడం అంటే గొప్ప విషయమని అన్నారు. ఖలీల్ బాబు లాంటి మానవతావాదులకే ఈ సర్వమానవ సేవ సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాబా దర్గా, దర్బార్ సేవకులు, ప్రేమికులు తమ సేవలను అందించారు.

# లోక్ అదాలత్‌లో 2.84 కోట్ల కేసులకు ముగింపు

(మొదటి పేజీ (తరువాయి)

ఉన్నవిగా గుర్తించారు. లోక్ అదాలత్ విధానం ద్వారా పరస్పర చర్చలు, రాజీ ఒప్పందాల ద్వారా ఈ కేసులు త్వరగా ముగిశాయి. దీంతో కోర్టుల్లో సంవత్సరాలుగా కొనసాగుతున్న అనేక వివాదాలకు ఒకే రోజులో ముగింపు లభించింది.ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని దేశంలోని న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో హైకోర్టులు, జిల్లా కోర్టులు, వివిధ ట్రైబ్యునళ్లు, వినియోగదారుల ఫోరంలు, శాశ్వత లోక్ అదాలత్‌లు వంటి అనేక న్యాయ వేదికలలో కేసులను విచారించి పరిష్కరించారు. వేలాది న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ సేవా వాలంటీర్లు ఇందులో పాల్గొన్నారు.ఈ లోక్ అదాలత్‌లో అనేక రకాల కేసులు పరిష్కరించబడ్డాయి. ముఖ్యంగా సివిల్ కేసులు, జరిమానాలకు అర్హత ఉన్న క్రిమినల్ కేసులు, రెవెన్యూ వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం పొందాయి. ఉద్యోగ సేవలు, పింఛన్ సమస్యలు, మోటార్ వాహన ప్రమాద క్లెయిమ్‌లు కూడా విస్తృతంగా విచారించి ముగించారు.ట్రాఫిక్ చలానాలు, కుటుంబ మరియు వైవాహిక వివాదాలు, వారసత్వ సంబంధిత కేసులు, భూసేకరణ సమస్యలు, కార్మిక వివాదాలు కూడా ఈ సందర్భంగా పరిష్కరించబడ్డాయి. అదనంగా వినియోగదారుల ఫిర్యాదులు, విద్యుత్, నీటి, టెలిఫోన్ బిల్లులకు సంబంధించిన వివాదాలు కూడా లోక్ అదాలత్ ద్వారా ముగిశాయి.లోక్ అదాలత్‌ల ప్రధాన ఉద్దేశ్యం కేసులను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించడం. ఇందులో పక్షాల మధ్య పరస్పర చర్చల



ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. కోర్టు ఫీజు తిరిగి చెల్లించే అవకాశం కూడా ఉండటం వల్ల ప్రజలు ఈ విధానాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. దేశంలోని కోర్టుల్లో పెండింగ్ కేసులు కోట్లలో ఉన్న నేపథ్యంలో లోక్ అదాలత్‌లు న్యాయ వ్యవస్థపై ఉన్న ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.ఒకే రోజులో లక్షల సంఖ్యలో కేసులు పరిష్కరించబడటం వల్ల కోర్టుల పనిభారం గణనీయంగా తగ్గుతోంది. త్వరితగతిన న్యాయం పొందే అవకాశాన్ని ప్రజలు ఎక్కువగా వినియోగించుకోవాలని న్యాయ సేవా సంస్థలు సూచిస్తున్నాయి. లోక్ అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు రెండూ ఆదా కావడంతో పాటు సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## పోలవరానికి నిధుల వరద

(మొదటి పేజీ (తరువాయి)

15లోపు పూర్తిగా ఖర్చు చేస్తే ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన మిగిలిన నిధులను కూడా విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. సింగిల్ నోడల్ ఖాతాలో ఉన్న ఈ నిధులను వెంటనే పోలవరం ప్రాజెక్టు ఖాతాకు బదిలీ చేసి పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టింది.విడుదలైన మొత్తంలో నిర్మాణ పనుల కోసం రూ.500 కోట్లు కేటాయించారు. ముఖ్యంగా డ్యామ్ నిర్మాణం, అనుబంధ నిర్మాణాలు, ఇంజినీరింగ్ పనులు వేగంగా కొనసాగించేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. పునరావాసం అత్యంత కీలక అంశంగా ఉండటంతో బాధిత కుటుంబాల పునరావాస కార్యక్రమాల కోసం మరో రూ.500 కోట్లు కేటాయించారు. మిగిలిన రూ.508 కోట్లు భూసేకరణ, పరిపాలన ఖర్చులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం వినియోగించనున్నారు.ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి గణనీయమైన స్థాయిలో నిధులు విడుదల అవుతున్నాయి. ఇప్పటివరకు మొత్తం రూ.5512.40 కోట్లు విడుదలయ్యాయి. తాజాగా విడుదలైన రూ.1508 కోట్లను కలుపుకుంటే మొత్తం నిధుల పరిమాణం మరింత పెరిగింది.

ఇదిలా ఉండగా పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర జలసంఘం, ఇతర నిపుణుల బృందాలు తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నాయి. అవసరమైన సాంకేతిక సూచనలు, మార్గదర్శకాలు అందిస్తూ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ కొనసాగుతోంది. విదేశీ నిపుణుల బృందాలు కూడా ప్రాజెక్టు నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్నాయి.ప్రాజెక్టు పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి సమస్యకు కూడా పరిష్కారం లభించనుంది. అలాగే విద్యుత్ ఉత్పత్తి ద్వారా రాష్ట్రానికి అదనపు ప్రయోజనం కలగనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం పోలవరం ప్రాజెక్టు పురోగతికి మరింత బలం చేకూర్చిందని అధికారులు పేర్కొంటున్నారు..

## ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి పేజీ (తరువాయి)

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తున్న ఎన్డీఏకు ఇవి మరో పరీక్షగా భావిస్తున్నారు. ఇండియా కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాగా వేయాలనే లక్ష్యంతో బీజేపీ వ్యూహాలు రచిస్తోంది.తమిళనాడులో రెండు విడతల్లో, పశ్చిమ బెంగాల్‌లో ఆరు విడతల్లో పోలింగ్ జరిగే అవకాశం ఉందని సమాచారం. కేరళ, అస్సాంలో ఒక్కటి లేదా రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించే అవకాశముంది. ఎన్నికల ప్రక్రియను ఏప్రిల్ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రచార కార్యక్రమాలను కూడా పార్టీలన్నీ వేగవంతం చేయనున్నాయి.తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎన్డీఏ కూటమికి అధికారంలోకి వచ్చే అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త వ్యూహాలతో బీజేపీ బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా తమిళనాడులో అన్నా డీఎంకేతో పొత్తు కుదుర్చుకుంది. బెంగాల్‌లో తాజా రాజకీయ పరిణామాలు తమకు అనుకూలంగా మారతాయని బీజేపీ నేతలు లెక్కలు వేస్తున్నారు.తమిళనాడులో ఈసారి పోరు హోరాహోరీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినీ నటుడు విజయ్ ప్రారంభించిన పార్టీ ప్రభావం ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది. తన పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని విజయ్ ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీతో జతకట్టిన అన్నా డీఎంకే నుంచి కొంతమంది నేతలు డీఎంకేలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం ద్వారా వచ్చే జాతీయ ఎన్నికల నాటికి మరింత బలోపేతం కావాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు ఇండియా కూటమి పార్టీలు తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు ఈ ఎన్నికలు కీలక పరీక్షగా మారుతున్నాయి.ఈ నేపథ్యంలో అయిదు రాష్ట్రాల ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు జాతీయ రాజకీయాల సెమీ ఫైనల్స్‌గా అభివర్ణిస్తున్నారు. వేసవి కాలంలో ఎన్నికల వేడి మరింత పెరగనుండగా, అన్ని ప్రధాన పార్టీలు విస్తృత ప్రచార కార్యక్రమాలతో ప్రజల ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో రాబోయే వారాల్లో దేశ రాజకీయాల్లో ఎన్నికల సందడి మరింత ఉత్కంఠభరితంగా మారనుంది.

## నెతన్యాహు పిల్లల హంతకుడు

(మొదటి పేజీ (తరువాయి)

గార్డులు నిర్వహించే 'సెపా' అనే వార్తా వెబ్‌సైట్‌లో ప్రచురితమైంది.ఇదే సమయంలో నెతన్యాహు హత్యకు గురయ్యారనే వార్తలను ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం పూర్తిగా ఖండించింది. ప్రధాని సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేస్తూ ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రధాని ఆరోగ్యం లేదా భద్రతపై ఎలాంటి సమస్యలు లేవని కూడా అధికారులు పేర్కొన్నారు.అయితే అధికారిక ప్రకటన వచ్చిన కొద్ది గంటలకే ఇరాన్ విప్లవ గార్డుల నుంచి వచ్చిన ఈ హెచ్చరికలు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. పశ్చిమాసియాలో ఇప్పటికే కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య ఈ ప్రకటన పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ వదంతులకు ప్రధాన కారణం నెతన్యాహు సోషల్ మీడియాలో పంచుకున్న ఒక వీడియోగా భావిస్తున్నారు. ఆ వీడియోలో ఆయన చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కనిపించడంతో అది మార్ఫింగ్ చేసిన వీడియో కావచ్చని లేదా కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసిన వీడియో కావచ్చని అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆ వీడియో నిజస్వరూపంపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి.ఇదే సమయంలో నెతన్యాహు కుమారుడు మార్చి 9 తర్వాత సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చేయకపోవడం కూడా వదంతులకు కారణమైంది. కుటుంబంలో ఏదైనా విషాదం జరిగి ఉండవచ్చని కొందరు సోషల్ మీడియా వినియోగదారులు ఊహాగానాలు వ్యక్తం చేశారు. అయితే ఇప్పటివరకు అధికారికంగా అలాంటి విషయంపై ఎలాంటి సమాచారం వెలువడలేదు.మొత్తంగా చూస్తే సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులు, అనుమానాస్పద వీడియో, ఇరాన్ విప్లవ గార్డుల తీవ్ర వ్యాఖ్యలు కలిసి ఈ అంశాన్ని అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వం మాత్రం ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని స్పష్టం చేస్తోంది.

## తెలుగు డ్రగ్స్ పార్టీ అంటూ విమర్శలు

(మొదటి పేజీ (తరువాయి)

చేస్తున్న వైసీపీ నేతలు ఈ ఘటనను పెద్ద ఎత్తున ప్రస్తావిస్తున్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం చేస్తామని చెప్పే ప్రభుత్వం తమ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధి డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. టిడిపి పేరును తెలుగు డ్రగ్స్ పార్టీగా మార్చాల్సిన పరిస్థితి వచ్చిందని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు దొరికిన వ్యక్తి ఎంపీగా కొనసాగడం రాష్ట్ర ప్రజలకు సిగ్గుచేటని, ఆయన పదవిలో కొనసాగే అర్హత లేదని వైసీపీ నాయకులు మండిపడుతున్నారు.ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు దమ్ముంటే వెంటనే ఎంపీని పార్టీ నుంచి బహిష్కరించాలని వైసీపీ నేతలు కోరుతున్నారు. ఇదే అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల కూడా స్పందిస్తూ మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపీ ఉండడం చాలా సిగ్గుచేటని పేర్కొన్నారు. ఆయనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ ఘటన రాజకీయంగా పెద్ద దుమారం రేపుతున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. గతంలో అవినీతి, నేర ఆరోపణలు ఎదుర్కొన్న నేతలపై కఠిన చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఈ ఘటనపై కూడా చర్యలు తప్పవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. ఘటనపై పూర్తి వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు సూచించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించారు. వ్యక్తిగతంగా ఎవరైనా చేసిన తప్పుల వల్ల పార్టీకి నష్టం కలగకుండా చూసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.అధికార పార్టీకి చెందిన ఎంపీపై వచ్చిన ఈ ఆరోపణలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీయగా, ఈ వ్యవహారం ఎలా మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## డ్రగ్స్ సంస్కృతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న తెలుగుదేశం పార్టీ

### వైస్సార్సీపీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్

**విజయవాడ, మార్చి 15:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ డ్రగ్స్ మాఫియాకు ప్రధాన కేంద్రంగా మారుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ాఇటీవల జరిగిన ఒక సంఘటనలో తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ గారు డ్రగ్స్ పార్టీలో పాల్గొనడమే కాకుండా ఆయనకు నిర్వహించిన పరీక్షల్లో 'డ్రగ్స్ పాజిటివ్' అని తేలడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోందని పేర్కొన్నారు.?ఈ సందర్భంగా కామరాజ్ హరీష్ మాట్లాడుతూ పలు కీలక అంశాలను లేవనెత్తారు ?కూటమి ప్రభుత్వ ద్వంద్వ నీతి ప్రదర్శిస్తుందన్నారు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం 'యాంటీ డ్రగ్స్' పేరుతో సైకిల్ యాత్రలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఆర్భాటం చేస్తోందని,కానీ మరోవైపు తమ సొంత పార్టీ ఎంపీలే డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు.?చర్యలు ఎక్కడ?: డ్రగ్స్ పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేష్ గారికి పాజిటివ్ అని రిపోర్టులు వచ్చినప్పటికీ, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కానీ,తెలుగుదేశం పార్టీ కానీ ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.?ప్రజల ఓట్లతో గెలిచిన బాధ్యత ఎక్కడ అని ప్రశ్నించారు.లక్షలాది మంది ప్రజల ఓట్లతో గెలిచి,చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ఎంపీ ఇలాంటి అనైతిక పనులకు పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు.?రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో తక్షణమే స్పందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.



పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న ముస్లిం సహకార ఫౌండేషన్ సభ్యులు

# ముస్లిం సహారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

**యాడికి (తెలుగోడు), మార్చి 15 :**

రంజాన్ మాసంను పురస్కరించుకుని యాడికి ముస్లిం సహారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 40 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగానికి ప్రతీక రంజాన్ అని,రంజాన్ ను పురస్కరించుకుని పేదలకు తోఫాను ఇస్తున్న ముస్లిం సహారా ఫౌండేషన్ సభ్యులను పలువురు అభినందించారు. ప్రతి ఒక్కరు సోదర భావంతో పండుగ జరుపుకునే విధంగా తోఫా పంపిణీ చేయడం హర్షణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ మెకానిక్ హాజీవలి, వేములపాడు మహబూబ్ బాషా, హల్దీ హాజీవలి పోస్ట్ మ్యాన్ మహబూబ్ బాషా, మస్తాన్, టైలర్ చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న హిరాపురం ఫయాజ్ బాషా

# ముస్లింలకు ఫయాజ్ బాషా ఇఫ్తార్ విందు

### ఫయాజ్ బాషా ట్రస్ట్ సేవలకు సలాం అంటున్న ప్రజలు

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 15 :**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఫయాజ్ బాషా ట్రస్ట్ అధ్యక్షుడు హిరాపురం ఫయాజ్ భాషా ఆదివారం తన నివాసంలో ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాసాన్ని ముగించుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం సేవా కార్యక్రమాల భాగంగా ఫయాజ్ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని మసీదుల్లో సేవలు అందిస్తున్న 66 మంది మౌజన్‌లు, ఇమామ్‌లకు నగదు సహాయం అందజేయడం జరిగింది. అదేవిధంగా పేద కుటుంబాలకు చెందిన దాదాపు రెండు వేల మంది మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేసి వారికి సాయంగా నిలిచారు. బండా మసీదు నందు ఇచ్చిన ఇఫ్తార్ విందులో భాగంగా ముస్లిం సోదరులతో కలిసి హిరాపురం ఫయాజ్ భాషా ప్రార్థనలు నిర్వహించి, దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫయాజ్ భాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు.

ఫయాజ్ భాషా చేపడుతున్న సేవా కార్యక్రమాలను పట్టణ ప్రజలు అభినందిస్తూ ఆయన సేవలకు సలాం చేస్తున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతతో పేదల పట్ల చూపుతున్న ఆప్యాయత అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు షాషావలి, సలాం, రియాజ్, షఫీ, రాజశేఖర్ రెడ్డి, నూర్, అయబ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రముఖులు, ముస్లిం మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



బండా మసీదులో ఇఫ్తార్ విందు ఇస్తున్న హిరాపురం ఫయాజ్ బాషా



గుత్తి కోట ఉత్సవాలలో పురాత నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

# గుత్తి కోటలో పురాతన నాణేల ప్రదర్శన

### కానిస్టేబుల్ విష్ణు భగవాన్..

**యాడికి (తెలుగోడు), మార్చి 15 :**

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గుత్తి కోట ఉత్సవాలలో గుత్తి కోట సంరక్షణ సమితి, రాయలసీమ నాణెముల సేకరణ సంఘం ఆధ్వర్యంలో పురాత నాణేల ప్రదర్శన నిర్వహించారు. రాయలసీమ నాణేల సేకరణ సంఘం తాడిపత్రి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ విష్ణు భగవాన్, నాగరాజు రావు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో క్రీస్తుపూర్వం నాటి మౌర్యులు, శాతవాహనులు, సెబాక రాజులు, ఇక్ష్వాకులు, క్షత్రపాలు, హిరణ్యక రాజులు, విష్ణుకుండినులు, విజయనగర సామ్రాజ్యంలోని బుక్కరాయలు, హరిహరరాయలు, రెండవ దేవరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, ప్రతాపదేవరాయలు, అచ్యుతదేవరాయలు, కుర సామ్రాజ్యం, గాంధార, అస్మక జనపద, మగధజనపద, సురసేన జనపద లాంటి అత్యంత పురాతన నాణేలు ప్రదర్శనలో ఉంచారు. ప్రజలు భారీగా తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు.



గుత్తి కోటలో పురాతన నాణ్యాల ప్రదర్శన నిర్వహించిన కానిస్టేబుల్ విష్ణు భగవాన్, నాగరాజు రావు



శ్రీ లక్ష్మి భూదేవి సమేత వెంకట రమణ స్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. . తరలివచ్చిన భక్తులు .

# శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

## వేడుకగా శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి కళ్యాణోత్సవం.. గోవింద నామాలతో మారుమోగిన కొత్త రాయుడు స్వామి ఆలయం..

**యాడికి (తెలుగోడు), మార్చి 15 :**

యాడికి మండలం కమలపాడు పంచాయతీ చింతలపల్లి గ్రామ సమీపంలో కొండ వద్ద స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం నూతన ధ్వజస్తంభ పునర్నిర్మాణం భక్తుల గోవింద నామస్మరణ మధ్య వేడుకగా సాగింది. ఈ సందర్భంగా హోమం, గణపతి, హనుమ, గరుడ, శంకు చక్ర నామాలు, బలిపీఠం, స్వామివారి పాదాలు, జయ విజయుల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన కళ్యాణ వేదికలో శ్రీ లక్ష్మీ భూదేవి సమేత వెంకటరమణ స్వామి కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ, గంగవరం కుటుంబం ఆధ్వర్యంలో 2000 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం విందు భోజనంఏర్పాటు చేశావనేజ వాగ్దేవి స్కూల్ , విజన్ స్కూల్ బస్సులు, నాలుగు ప్రైవేట్ వెహికల్స్ భక్తుల రవాణా కోసం ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో ప్రజలు భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారిని వైసిపి సీనియర్ నాయకుడు బాల రమేష్ బాబు, బొంబాయి రమేష్ నాయుడు, ఆయన కుమారుడు ఉపేంద్ర నాయుడు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం చంద్రయ్య కుటుంబం, సత్యనారాయణ, సూరి, శేఖర్ ,సురేష్, ప్రసాద్, రవి, ప్రదీవ్, కేదార్ , నిఖిల్ , తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కొత్త వెంకటరమణ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం



శ్రీ కొత్త వెంకటరమణ స్వామి కళ్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న భక్తుడు చంద్రయ్య



వైసిపి నాయకుడు బొంబాయి రమేష్ తనయుడు ఉపేంద్ర నాయుడుకు సన్మానం చేస్తున్న దృశ్యం. శ్రీ కొత్త వెంకటరమణ స్వామి దర్శనం చేసుకుంటున్న వైసీపీ సీనియర్ నాయకుడు బాల రమేష్ బాబు

# తాడిపత్రిలో క్యాంపు రాజకీయాలు!


### తమిళనాడులో క్యాంపు రాజకీయాలపై చర్చ..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 15 :**

మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే తాడిపత్రి పట్టణంలో క్యాంపు రాజకీయాలు ప్రారంభమయ్యాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఏకంగా రాష్ట్రాన్ని దాటి తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు శ్రీ బృహలింగేశ్వర దేవస్థానంలో అధికార పార్టీకి చెందిన ఓ కుల సంఘం అధ్యక్షుడు ప్రతిపక్ష నేతతో కలిసి రహస్యంగా క్యాంపు రాజకీయాలకు శ్రీకారం చుట్టినట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. తాడిపత్రి మునిసిపల్ ఓటర్ల శాతంలో రెండో స్థానంలో ఉన్న ఓ కుల సంఘం అధ్యక్షునితో ప్రతిపక్ష నేత చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ విషయం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత నెల 21న అధికార పార్టీకి చెందిన ఓ కుల సంఘం అధ్యక్షుడు, తన సామాజిక వర్గానికి చెందిన సభ్యులు, కుల సంఘం పాలక మండలి సభ్యులు మరియు అనుచరులతో కలిసి నాలుగు బస్సుల్లో తీర్థయాత్రలకు బయలుదేరినట్లు తెలిసింది. ఈ యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రముఖ దేవస్థానాలను దర్శించారు. వీరు గండికోట, కాణిపాకం, తిరుచానూరు, తిరుమల తిరుపతి దేవస్థానం, అరుణాచలం, తంజావూరు, శ్రీరంగపట్టణం వంటి ప్రాంతాలను సందర్శించినట్లు సమాచారం.

**దేవస్థానం సమీపంలో భేటీపై చర్చ..**

ఈ యాత్రలో భాగంగా 24వ తేదీన తంజావూరులోని శ్రీ బృహలింగేశ్వర దేవస్థానంలో అధికార పార్టీకి చెందిన ఓ కుల సంఘం అధ్యక్షుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలిసినట్లు సమాచారం. దేవస్థానంలో జరిగిన ఈ భేటీ సాధారణంగా జరిగిందా. లేక కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలుకుతోంద? అనే



అంశంపై పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

***తిరుగుటపా కట్టిన కౌన్సిలర్:***

ఈ తీర్థయాత్రలో అదే సామాజిక వర్గానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. అయితే రాజకీయ సమీకరణాల విషయం తెలిసిన తర్వాత తంజావూరుకు వెళ్లకుండా అరుణాచలం నుంచి తిరుగుటపా కట్టి తాడిపత్రికి చేరుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

***రాజకీయాలకు సంబంధం లేదు..***

ంజావూరు శ్రీ బృహలింగేశ్వర దేవస్థానంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అనుకోకుండా కలిసామని, ఓ ఆడిటర్ కోసం కేతిరెడ్డి పెద్దారెడ్డి అక్కడికి వచ్చారని కుల సంఘం అధ్యక్షుడు తెలుగోడు ప్రతినిధికి తెలిపారు. ఈ భేటీకి ఎలాంటి రాజకీయ సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

# తాడిపత్రిలో అక్షర ఆంధ్ర పరీక్షలు

### హాజరైన 6,298 మహిళా అభ్యాసకులు..

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 15 :**

తాడిపత్రి పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గుర్తించిన 6,298 మంది నిరక్షరాస్య మహిళా అభ్యాసకులకు పరీక్షలు నిర్వహించారు. డిసెంబర్ 2025 నుండి ప్రతిరోజూ రాత్రి 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, 629 మంది వలంటీర్ల ద్వారా శిక్షణ అందించారు. అనంతరం ఆదివారం పరీక్షలు నిర్వహించారు. పరీక్షల కోసం పట్టణంలో ఉన్న 30 పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు 90 మంది సచివాలయ సిబ్బంది, మెప్మా తరపున 45 మంది రిసోర్స్ పర్సన్లు, 10 మంది ఉన్నత స్థాయి అధికారులు స్క్వాడ్ అధికారులుగా, 629 మంది వలంటీర్లు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించారు.

**పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే**

విజయనగర్ కాలనీలోని మున్సిపల్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శాసన సభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి అకస్మికంగా సందర్శించారు. అక్కడ



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి



ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి వివరాలు తెలుపుతున్న కమిషనర్ శివరామకృష్ణ

అభ్యాసకులతో ముఖాముఖిగా మాట్లాడి, కార్యక్రమం నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యత సమాజ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకుని విద్యావంతులుగా మారాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యత నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం పొందడానికి తగిన విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందని కూడా సూచించారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ తులసి ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డికి కార్యక్రమ అమలు విధానాన్ని వివరించారు. తాడిపత్రి పట్టణంలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించిన అక్షర ఆంధ్ర పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు.



ఏపీపీ పరమేశ్వర్ రెడ్డిది సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరమేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం

**గుత్తి (తెలుగోడు), మార్చి 15:**

గుత్తి పట్టణానికి చెందిన పరమేశ్వర్ రెడ్డి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎంపికైన సందర్భంగా గుత్తి మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ కన్వీనర్ శివశంకర్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పరమేశ్వర్ రెడ్డి నియామకం పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు. వారు పేద ప్రజలకు న్యాయం చేయాలని భవిష్యత్తులో అనేక పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్ సభ్యులు ఏ ఎస్ ఐశ్రీనివాసులు రిటైర్డ్ హెచ్ఎం లు డేనియల్, ఫక్రుద్దీన్ అడ్వకేట్ విజయ భాస్కర్ ప్రసాద్, శ్రీనివాసులు లైన్మెన్లు ఉపాధ్యాయులు శివకుమార్, ప్రవీణ్ కుమార్,శంకరయ్య, శ్రీధర్ గౌడ్,సలీం,ఓబులేసు,పోతులయ్య,రవిచంద్రకుమార్, వ్యాపారవేత్తలు మాకం శ్రీకాంత్, బాబు,కరివేపాకు బాలరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

# ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా మెగా కార్డన్ డే

**గుత్తి (తెలుగోడు), మార్చి 15:**

గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్" లో భాగంగా,ఎస్సీ కాలనీ నందు గుంతకల్లు డిఎస్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, విద్యార్థుల హాస్టళ్లు, పీజీ నివాసాలు, చిన్న లాడ్జీలు, ఖాళీ భవనాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో మరియు పాత గంజాయి మరియు నార్కోటిక్ కేసులలో ఉన్నటువంటి ముద్దాయిలను పోలీసులు సోదాలు నిర్వహించారు.

ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా డి.ఎస్.పి శ్రీనివాసులు సిఐ రామారావు తోపాటు ఎస్సైలు హెడ్ కానిస్టేబుళ్లు పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రికార్డు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని తయారు చేయడంలో భాగంగా ఇకపై భవిష్యత్తులో తరచుగా వజ్రా ప్రహర్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం ఉంటే వెంటనే 19724 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీస్ అధికారులు పెద్ద సంఖ్యలో తనిఖీ నిర్వహించడంతో పోలీసుల అధికారుల అని తీరుపై ప్రశంసలు నిలువెత్తుతున్నాయి.



గుత్తిలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

# నేటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

### పకడ్బందీ ఏర్పాట్లు..

### ఎంఈఓ -1 గోవిందరాజులు, ఎంఈఓ -2 హరికృష్ణ..





**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 15 :**

నేటి నుంచి జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు బెళుగుప్ప మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈఓ 1 గోవిందరాజులు, ఎంఈఓ 2 హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాల, కేజీబీవీ లోని సుమారు 400 మందికి పైగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు.మండల కేంద్రమైన బెళుగుప్పలోని మొదటి సెంటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 232 మంది విద్యార్థులు, శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ రెండవ సెంటర్లో 218 విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రంలో ఎగ్జామినేషన్ చీఫ్, ఒక డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఇద్దరు చొప్పున ఉంటారన్నారు. పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, శుభ్రమైన తరగతి గదులు తదితర ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ శివ పేర్కొన్నారు.



# నేడు బత్తలపల్లికి మంత్రి సత్య కుమార్

**కేజీబీవీ పాఠశాలలో హెచ్ పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 15 :**
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ సోమవారం బత్తలపల్లి మండలంలో పర్యటించనున్నారు. సంజీవపురం సమీపంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి, అక్కడ 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా అందించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణపై విద్యార్థినులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. ?బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ,సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



# జడే శంకరేశ్వర స్వామికి నేడు ప్రత్యేక పూజలు

*యువభక్త బృందం..*

**అగళి (తెలుగోడు), మార్చి 15 :**
మండల కేంద్రంలోని చోళ రాజుల కాలం నాటి పురాతన శ్రీ జడే శంకరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్న సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనిస్వామివారి కృపకు పాత్రులు కావాలని జై జై శంకరేశ్వర స్వామి యువ భక్త బృందం పిలుపు నిచ్చారు.సోమవారాన్ని పురస్కరించుకొని స్వామి వారికి విశేషంగా పంచామృత అభిషేకం ప్రత్యేక పూలతో అలంకారం మహా నైవేద్యం సమర్పణ విశేషపూజ మహా మంగళ హారతి తీర్థప్రసాదం ఉపహారం ప్రసాదం వినియోగం ఉంటుందని అన్నారు.

# శుభకార్యంలో పాల్గొన్న సింగిల్ విండో అధ్యక్షులు గణేష్

**అమరాపురం (తెలుగోడు), మార్చి 15 :**
మండల పరిధిలో హేమావతి పంచాయితీ కోరేవు గ్రామంలో నారాయణప్ప కుమారుడు వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో అమరాపురం మండల్ సింగల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్ జిల్లా ఉపాధ్యక్షులు రత్నమ్మ నరసింహమూర్తి పాల్గొన్నారు. వారిని ఆశీర్వదించారు. వీరి వెంట మండల్ మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, చంద్రశేఖర్ గౌడ్, టి ఎన్ టి యు సి. కార్యదర్శి మంజన్న, వలస పంచాయితీ కన్వీనర్ బి.ఎస్. నాగరాజు, మల్లికార్జున, అశోక్, రాజు తదితరులు, పాల్గొన్నారు.



వివాహ రిసెప్షన్ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు రత్నమ్మ, నరసింహమూర్తి

# కేబుల్ వైర్లు చోరీ

**నలుగురు రైతన్నల మోటార్ వైర్లు మాయం వేల రూపాయల నష్టం**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 15 :**
మండలంలోని డి.చెర్లోపల్లి రెవెన్యూ పొలాల్లో గుర్తు తెలియని దుండగులు కేబుల్ వైర్లను దొంగలించి రైతన్నలకు నష్టం కలిగించారు. ఒకే రాత్రిలో నలుగురు రైతుల మోటార్ కేబుల్ వైర్లు మాయం కావడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల... డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన మండల నాగశేష తన 7 ఎకరాల పొలంలో బోరు వేసుకుని దానిమ్మ తోట సాగు చేస్తున్నారు. శనివారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆయన ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ నుంచి మోటార్ వరకు ఉన్న సుమారు 80 మీటర్ల కేబుల్ వైర్ కనిపించలేదు. దాని విలువ సుమారు రూ.12,000గా అంచనా వేస్తున్నారు.అదే విధంగా వడ్డీ నాగరత్న పొలంలో 60 మీటర్ల కేబుల్ వైర్ రూ.9,000, గుజ్జల కృష్ణమూర్తి పొలంలో 50 మీటర్ల కేబుల్ వైర్ రూ.7,500, వెంగర్ నాయుడు మామిడి తోటలోని 15 మీటర్ల కేబుల్ వైర్ రూ.1,050 కూడా దుండగులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.



జడ్పిటిసి ఉమేష్ చేతుల మీదుగా బియ్యం బస్తా పంపిణీ చేస్తున్న దృశ్యం . ాల్గొన్న నందరాజునపల్లి గ్రామ ప్రజలు

# అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహాదానం

**మూడున్నర లక్షలతో తాగునీటి సౌకర్యం..**
**135 కుటుంబాలకు బియ్యం బస్తాలు పంపిణీ ..**
**జడ్పిటిసి ఉమేష్ ..**
**దాత విశ్రాంత అధికారి కరియన్న..**

**అగళి (తెలుగోడు), మార్చి 15 :**
అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహాదానం 25 కిలోల బియ్యం బస్తాలు 135 కుటుంబాలకు విశ్రాంత అధికారి కరియన్న దానంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారని అని జెడ్పిటిసి ఉమేష్ పేర్కొన్నారు.మండల పరిధిలోని నందరాజనపల్లి గ్రామవాసి శ్రీ కరియమ్మ దేవత పూజారి అయిన పూజారి చిక్కన్న కుమారుడు పూజారి కరియన్న వారి అవ్వ దివంగత కరియమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థంగా ఏపీ ప్రభుత్వం విజయవాడ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ నుండి అనుమతి పొంది నందరాజనపల్లి గ్రామ దేవత కరియమ్మ దేవాలయానికి సంబంధించిన స్థలంలో తన సొంత ఖర్చులతో బోర్వెల్ వేయుటకు అనుమతి తీసుకుని జెడ్పిటిసి ఉమేష్ స్థానిక పంచాయతీ మాజీ సర్పంచ్ నింగన్న ఆనందప్ప హరీష్ నారాయణప్ప పెద్ద గంగప్ప కావలప్ప భీమప్ప కరియన్న వీరి సహకారంతో 660 అడుగులు బోరు బావి తవ్వించారు.మీరు పుష్కలంగా రావడంతో మోటర్ బిగించి వాటర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించి నీరు సరఫరా చేసి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. ఇందుకు దాదాపు మూడున్నర లక్షల రూపాయల దాకా ఖర్చు చేశారు.అంతేకాకుండా కరియమ్మ వర్ధంతిని పురస్కరించుకొని



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

(ఇదేరోజు)ఆదివారం నందరాజనపల్లి గ్రామ దేవత కరియమ్మ దేవతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దివంగత కరియమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ దేవత కరియమ్మ దేవతా అమ్మవారి సన్నిధిలోనే ఆ గ్రామంలో నివసిస్తున్న నూట ముప్పై ఐదు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తా ఒకటి చొప్పున మొత్తం 135 కుటుంబాలకు 135 బస్తాలను జడ్పిటిసి రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేయించి దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ దేవుని దర్శనార్థం వచ్చేవారు తమ పూజా కార్యక్రమాలు ముగించుకుని వెళ్ళిపోతుంటారని, అయితే నీటి సౌకర్యం కల్పించడమే కాక పండుగ వేళ బియ్యం బస్తాలు అందించడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తూ ఆ దేవుడి ఆశీస్సులు వారికి వారి కుటుంబ సభ్యులకు సదా ఉండాలని కోరుకుంటూ వారికి కృతజ్ఞత అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పూజారి చిక్కన్న కుమారుడు విశ్రాంత పోలీస్ అధికారి పూజారి కరియన్న కుటుంబ సభ్యులు, జడ్పిటిసి ఉమేష్, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్,వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజు,మాజీ సర్పంచ్ నందరాజనపల్లి నింగన్న,స్థానిక సర్పంచ్ సోదరుడు యువ నాయకుడు మంజు చరణ్, ఆనందప్ప, రామచంద్రప్ప, సిద్దలింగప్ప, కావలప్ప, నారాయణ, ఆనిమేటర్ రామన్న, ఓబులేష్, తిమ్మన్న, రవి, రంగనాథ్, లెంకప్ప, సిద్ధగంగప్ప, యర్రప్ప, పాండురంగప్ప, జయరామప్ప,తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు




వాటర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించిన దృశ్యం

# దంపెట్ల చెన్నకేశవాలయంలో 800 ఏళ్ల నాటి శాసనం గుర్తింపు

**దేవగిరి యాదవ రాజుల కాలానికి చెందిన ఆధారాలు లభ్యం..**
**చరిత్రకారుడు బుక్కపట్నం గోపి..**

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 15 :**
మండలంలోని దంపెట్ల గ్రామ శివారులో, చిత్రావతి నది ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సుమారు 800 ఏళ్ల నాటి అరుదైన కన్నడ శాసనం వెలుగులోకి వచ్చింది. ఈ శాసనాన్ని చరిత్రకారుడు బుక్కపట్నం గోపి గుర్తించారు.ఆదివారం ఆయన విలేకరులతో



లక్ష్మీ చెన్నకేశవాలయంలో లభ్యమైన శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు బుక్కపట్నం గోపి



దంపెట్ల చెన్నకేశవాలయంలో లభించిన రాతి శాసనం

మాట్లాడుతూ, ఈ శాసనం సింహళ దేవుడు అనే దేవగిరి యాదవ రాజు కాలానికి చెందినదని తెలిపారు. క్రీ.శ. 1225 జనవరి 21 (మాఘ మాసం, మంగళవారం) ఈ శాసనం వేయించబడినట్లు పేర్కొన్నారు. శాసనంలో ఉన్న వివరాల ప్రకారం, ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతాన్ని అప్పట్లో మధురాపురం అనే గ్రామంగా పిలిచేవారని గోపి చెప్పారు. ఆలయ సేవలకు గుర్తింపుగా రాజు అక్కడి ప్రముఖులకు సర్వమాన్య భూములు దానంగా ఇచ్చినట్లు శాసనం తెలియజేస్తోంది.ఇప్పటికే కునుతూరు గ్రామంలో కూడా ఇదే రాజు కాలానికి చెందిన మరో శాసనాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాంతంలో యాదవ రాజుల పాలన సాగిందనడానికి ఇవి ముఖ్య

# అమరాపురంలో సజావుగా అక్షర ఆంధ్ర పరీక్షలు

**ఎంపీడీఓ రామారావు, ఏ.పి.ఎం. ముత్యాలప్ప ..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 15 :**
ప్రభుత్వం ఎంతో ప్రతిష్ట త్మాకంగా చేపట్టిన అక్షర ఆంధ్ర పరీక్షలు అమరాపురం మండలంలో ఆదివారం సజావుగా జరిగినట్లు అక్షర ఆంధ్ర పథకం మండల చైర్మన్, స్థానిక ఎం.పీ.డీ.ఓ. డి. రామారావు తెలిపారు. ఈ సందర్భంగా మండల్ చైర్మన్ రామారావు ఏ.పీ.ఎం. ముత్యాలప్ప మాట్లాడుతూ మండలంలోని 46 పరీక్ష కేంద్రాలలో 1910మంది హాజరై పరీక్ష వ్రాసారన్నారు.మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ,ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ముత్యాలు, సీ.సీ. భాస్కర్, గోపాలకృష్ణ, అంగన్వాడీ వర్కర్లు, ఇన్విజిలేటర్లు 46 మంది, మానిటరింగ్ ఏ.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం ముత్యాలప్ప



అమరాపురంలో అక్షర ఆంధ్ర పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం. పరీక్షలు రాస్తున్న మహిళలు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

# నేడు అవగాహన సదస్సు

**ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు..**

**అగళి (తెలుగోడు), మార్చి 15 :**
డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్ఫలితాలు, హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే నష్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. సోమవారం సాయంత్రం 3.30 గంటలకు మడకశిర పట్టణంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ , సినీ హీరో విష్ణు, సినిమా హీరోయిన్ కుమారి అనన్య నాగళ్ల, సినీనటులు కారుమంచి రఘు హాజరు కానున్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి మహాత్మా జ్యోతిబాపూలే సర్కిల్ (అమరాపురం బస్టాండ్) వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారన్నారు. అనంతరం అక్కడే అవగాహన సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా యువకులు, విద్యార్థులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బైక్ ర్యాలీకి ద్విచక్రవాహనంతో పాటు హెల్మెట్ ధరించి మధ్యాహ్నం 3 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కు చేరుకోవాలని శాసన సభ్యులు ఎం.ఎస్. రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి విజ్ఞప్తి చేశారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైకాపా సమన్వయకర్త ఈర లక్కప్ప రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హల్కూర్ కాంతరాజు మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్

# వివాహ వేడుకల్లో పాల్గొన్న వైకాపా నాయకులు

**అమరాపురం (తెలుగోడు), మార్చి 15 :**
అమరాపురం మండలం తమ్ముడే పల్లి పంచాయతీ పరిధి నాగోన పల్లి లో ఎంపీటీసీ నారాయణ గౌడ బంధువు ఆనందగౌడ, నమిత ల వివాహానికి హాజరైన మడకశిర తాలూకా వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హలకూరు కాంతారాజు, మండల కన్వీనర్ త్రిలోకనాథ్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ లు వధూవరులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమం అయిన తర్వాత ఆ ప్రాంతంలో ఓ చెట్టు కింద వైకాపా నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమన్వయకర్త ఈరలకప్ప మరియు రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హలకూరు కాంతా రాజు లు మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు వైకాపా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు శివన్న, సర్పంచ్, సదానందగౌడ, ఒక్కలిగా, కుంచిటిగా మాజీ డైరెక్టర్ వీరాక్యాతప్ప ఉడుగురు నాగరాజు,యంజీరప్ప, వెంకటస్వామి, మూర్థనప్ప, సిద్దేశ్వర, ప్రేమ్ కుమార్ తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



మడకశిర తాలూకా వైకాపా సమన్వయకర్త ఈర లక్కప్పతో చర్చిస్తున్న నాయకులు కార్యకర్తలు

# 10 వ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

*సింగిల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్..*



**అమరాపురం (తెలుగోడు), మార్చి 15 :**
విద్యార్థిని, విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షిస్తూ విష్ యు ఆల్ ద బెస్ట్ అంటూ మండల సింగిల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్ అన్నారు. విద్యార్థిని ,విద్యార్థులు ఎవరైనా సరే లిఫ్ట్ అడిగితే దయచేసి ఎగ్జామ్స్ సెంటర్ కు డ్రాప్ చేయాలని సూచించారు.

# పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

*ఎంపీడీవో రంగనాథ్ .. డిప్యూటీ ఎంపిడిఓ పద్మ..*

**అగళి (తెలుగోడు), మార్చి 15 :**
పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి అని డిప్యూటీ ఎంపిడిఓ పద్మ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో ఇంటి పన్నుల వసూళ్ళ కోసం ఆదివారం స్పెషల్ డ్రైవ్ ్ర నిర్వహించారు. ఇందులో బాగంగా అగళి పంచాయితీలో పలుచోట్ల ప్రజలతో సమావేశమైన డిప్యూటీ ఎంపీడీవో పద్మ పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్ గ్రామంలో ప్రజలు పన్నులు చెల్లిస్తూ సామాజిక పనులు డ్రైనేజీ రోడ్లు వీధిలైట్లు విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులకు తోడ్పాటును అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికి చేర్చేందుకు చర్యలు చేపడుతూనే అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు.ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పన్ను చెల్లించిన వారికి రసీదును అందిస్తున్న ఎంపిడిఓ రంగనాథ్



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మారుతి

# మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ మారుతి ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 15**

మహిళలపై పెరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మారుతి సూచించారు. ఆదివారం పెద్దకడబూరు మండల పరిధిలోని కంబళదిన్నె గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మారుతి గ్రామ ప్రజలకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, రక్షణ చర్యలు మరియు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపులంగా వివరించారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టం వారి పక్షాన నిలుస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా లింకులను నమ్మరాదని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, యువకులు మరియు పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. గ్రామస్తులు కూడా ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల సమాజంలో అవగాహన పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ బాలికలు

# రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు కోసిగి కేజీబీవీ బాలికలు ఎంపిక

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 15**

కర్నూలులో నిర్వహించిన రగ్బీ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో కోసిగి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. ఈ ఎంపిక పోటీలలో విద్యాలయానికి చెందిన శిరీష, శృతి హాసిని, సుధ తమ ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించారు. వీరు ఈ నెల 19, 20, 21, 22 తేదీలలో కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. అదే విధంగా సీనియర్ విభాగంలో కూడా కోసిగి కేజీబీవీకి చెందిన పీఈటీ సుమ రగ్బీ క్రీడలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. విద్యార్థినులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న పీఈటీ సుమ కృషి ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని విద్యాలయం వర్గాలు పేర్కొన్నాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విద్యాలయానికే కాకుండా మండలానికి గర్వకారణమని ఉపాధ్యాయులు తెలిపారు. రాబోయే పోటీలలో కూడా వారు ప్రతిభ కనబర్చి విద్యాలయానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల ఈ విజయంపై విద్యాలయం ప్రిన్సిపల్ షబానా, తెలుగు ఉపాధ్యాయురాలు సుజాతమ్మ, పీఈటీ సుమ, ఉపాధ్యాయ సిబ్బంది బాలికలను ప్రత్యేక అభినందించారు.

## ఆంధ్రప్రదేశ్ లైఫ్ ఫర్ నేచర్ రెండు రోజుల సదస్సు

**విజయవాడ (తెలుగోడు), మార్చి 15**

ఆంధ్రప్రదేశ్ లైఫ్ ఫర్ నేచర్ రెండు రోజుల సదస్సును స్థానిక రామవరప్పాడు రింగ్ రోడ్డు సమీపం లోని హోటల్ హయత్‌లో నిర్వహిస్తున్నట్లు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సదస్సుకు నాలెడ్జి పార్ట్నర్‌గా సి.ఆర్. మీడియా అకాడమీ వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఈ సదస్సుని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో డా. వాసంతి రావు, డైరక్టర్ జనర ల్ సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, (జమీా), న్యూ ఢిల్లీ, రుషికేశ్ చవాన్, డైరక్టర్, ది హేబిటేట్ న్యూ ఢిల్లీ, లతో పాటు తాము పాల్గొంటామని ఆయన పేర్కొన్నారు.





పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# చిన్నారులకు దుప్పట్లు పంపిణీ

ఉదయగిరి/వరికుంటపాడు (తెలుగోడు) మార్చి 15

వరికుంటపాడు మండలం తూర్పు చెన్నంపల్లి గ్రామంలో ఆదయ్య నిర్వహిస్తున్న ఆదర్శ సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదయ్య ప్రతి రోజూ సాయంత్రం గ్రామంలోని చిన్నారులకు పోషకాహారం (న్యూట్రిషన్) అందించడం, వారికి ట్యూషన్ చెప్పడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నారు. చిన్నారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారికి దుప్పట్లు,టూత్ బ్రష్‌లు, పేస్ట్‌లు, సబ్బులు మరియు ఆడుకునే పరికరాలు అందించాలనే అభ్యర్థనను నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్‌కు తెలియజేశారు. ఆ అభ్యర్థనకు స్పందించిన ఫౌండేషన్ వారు చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని పి. ఎడ్వర్డ్ చేతుల మీదుగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆత్మకూరు కార్యనిర్వాహకులు పి. ఎడ్వర్డ్ మాట్లాడుతూ ఆదర్శ సేవా సంస్థ చైర్మన్ ఆదయ్య నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ జయరావు, బ్రదర్ రవి, పాస్టర్ ఆదాము పాల్గొన్నారు.





తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.
టీటీడీ దేవస్థానంలో శ్రీ గురు యల్లప్ప తాతా పూజారులు అయ్యన్న, ముత్తమ్మ

# ఏడుకొండలవాడిని దర్శించుకున్న శ్రీ గురు యల్లప్ప తాత భక్తులు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 15**

పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన శ్రీ యల్లప్ప తాతా భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి ఆదివారం శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ పర్వదినానికి ముందు చిన్నతుంబలం గ్రామానికి చెందిన శ్రీ గురు యల్లప్ప తాతా 200 మంది భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానానికి గత 80 ఏళ్లుగా వెళ్లడం ఆనవాయితీగా జరుగుతుంది. ఇందులో భాగంగా శ్రీ గురు యల్లప్ప తాతా ఆలయ పూజారులు పూజారి అయ్యన్న, ముత్తమ్మ ఆధ్వర్యంలో భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి దేవస్థానానికి వెళ్లారు. గ్రామానికి చెందిన భక్తులు తమ ఆధ్యాత్మిక పరంపరను కొనసాగిస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం కోసం వెళ్లడం ఒక విశిష్ట సంప్రదాయంగా మారింది. గ్రామానికి చెందిన శ్రీ గురు ఎల్లప్పతాత అడుగుజాడల్లోనే ఇక్కడి భక్తులు ఈ పుణ్యయాత్రను కొనసాగిస్తున్నారన్నారు. అయితే తిరుమలలో భక్తులకు తగిన వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఒకే గ్రామానికి చెందిన భక్తులు కలిసి వెళ్లే సందర్భంలో వారికి సముచితంగా ఉండే వసతి గృహాలు లేకపోవడం సమస్యగా మారిందని భక్తులు వాపోయారు. ఈ నేపథ్యంలో చిన్నతుంబలం గ్రామ భక్తుల కోసం తిరుమలలో ప్రత్యేకంగా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని లేదా భక్తులకు తగిన వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీటీడీని కోరారు. గ్రామ భక్తుల ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు అనుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేయాలని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉగాది పండుగకు చిన్నతుంబళం గ్రామానికి భక్తులు తిరిగి వచ్చి శ్రీ గురు యల్లప్ప తాతాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో చిన్నతుంబలం గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో
ప్రత్యేక పూజలు చేస్తున్న కేపీ యల్లప్ప





టీటీడీ దేవస్థానంలో చిన్నతుంబళం శ్రీ గురు యల్లప్ప తాతా భక్తులు

# సరస్వతీ మాత, వినాయక ఆలయం ప్రారంభం

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 15 :**

జవహర్ నవోదయ విద్యాలయ బనవాసిలలో నూతనంగా నిర్మించిన సరస్వతీ మాత, వినాయక ఆలయాన్ని ఆదివారం వైభవంగా ప్రారంభించింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, విగ్రహ ప్రతిష్ఠ, యాగాలు, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో విద్యాలయం ప్రిన్సిపాల్ ఈ. పద్మావతి , కే. వెంకటేశ్వర్లు, ఏకే బసవరాజ్, భాస్కర్, విద్యాలయం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు, పిటిసి మెంబర్స్, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన సిబ్బందికి, పూర్వ విద్యార్థులకు, స్కూల్ విద్యార్థులకు ,కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆలయ నిర్మాణంలో ముందుండి నడిపించిన ఏకే బసవరాజ్ (పిజిటి హిస్టరీ), ఎస్ .భాస్కర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం





ప్రతిష్ఠించిన సరస్వతీ మాత విగ్రహం. మాట్లాడుతున్న దృశ్యం

# శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 15 :**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ, గృహ ప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. నందవరం మండలం గురుజాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కృష్ణప్ప నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో కలుగోట్ల టీడీపీ కార్యకర్త బోయ చంద్ర కుమార్తె వివాహ వేడుకలు, చిన్న నెలటూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతు కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముగతి గ్రామంలో నిర్వహించిన ఈరన్న గౌడ్ కుటుంబ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న
ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి





ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు



ననియాల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు

# ననియాలలో ఒంటరి ఏనుగు సంచారం

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 15 :**

మండలంలోని ననియాల అటవీ సమీప ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు సంచారం చేసింది. శనివారం రాత్రి గ్రామ పంట పొలాల వైపు వచ్చేందుకు ప్రయత్నం చేసింది. అటవీ సిబ్బంది ఏనుగు లోతట్టు ప్రాంతానికి తరమెందుకు టపాకాయలు పేల్చి ప్రయత్నం చేశారు. రైతులు సాగు చేస్తున్న పొలాల్లో, మామిడి తోటల్లో గింకారాల అరుపులతో అడవి ప్రాంతంలోకి వెళ్ళింది. నారాయణపురం తండా, నంద్యాల తాండ, రామాపురం తండా, పచ్చారు మాకులపల్లి, ఎస్ గొల్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు రాత్రి సమయాల్లో తమకు పొలాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని అటవీ అధికారులు సూచించారు. అడవి సమీప గ్రామాల్లోని ప్రజలు ఏనుగు సంచరిస్తే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

# ఎద్దు పొడిచి వ్యక్తి మృతి

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 15 :**

మండల పరిధిలోని కావలి మడుగు గ్రామంలో ఓ వ్యక్తిని ఎద్దు పొడవడంతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కావిలిమడుగు గ్రామానికి చెందిన మృతుడి భార్య అశ్విని పోలీసులకు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద వ్యవసాయం చేసుకుంటూ పెంచి పోషించుకుంటున్న రెండు ఎద్దులు గ్రామ సమీపంలో మేత మేస్తూ ఒకదానిమీద ఒకటి పోట్లాడుకున్న సమయంలో తన భర్త అయినా రాజప్ప సుమారు (40) రెండు రెండు ఎద్దులను విడదీసేందుకు వెళ్లి అందులోని ఒక ఎద్దు తలపై గుద్దడంతో కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. ఈ సమయంలో పీఎంకే తండ గ్రామానికి చెందిన సుధాకర్ నాయక్ ఈ సంఘటనను తెలిపాడు. హుటాహుటిన 108 ద్వారా కుప్పం పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఎద్దు గుద్దడంతో తన భర్త మరణం పై కేసు నమోదు చేసుకుని తనకు అన్ని విధాల న్యాయం చేయాలని బాధితురాలు కోరింది. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతి చెందిన రాజప్ప ( ఫైల్ ఫోటో)



# మన పల్లె మన నీరు కార్యక్రమం

**కదిరి (తెలుగోడు), మార్చి 15 :**

కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గ్రామంలో రైల్వే బ్రిడ్జి ప్రక్కన కదిరి నియోజకవర్గంలో భూగర్భ జలాల అభివృద్ధి కొరకు జల వనరుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మన పల్లె మన నీరు మన అందరి బాధ్యత కార్యక్రమంలోకదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ , జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ గారు ఆర్డీవో వి.వి. ఎస్ శర్మ , స్వచ్ఛ ఆంధ్ర కమిషన్ డైరెక్టర్ పర్వీన్ బాను , రూరల్ మండల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# నేడు శ్రీస్వామి వారి హుండీల లెక్కింపు

**కదిరి (తెలుగోడు), మార్చి 15 :**

కదిరి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి హుండిల లెక్కింపు కార్యక్రమం సోమవారం జరుగుతుంది. హుండీల లెక్కింపు కార్యక్రమానికి హాజరగు దేవస్థానము సిబ్బంది ప్రభుత్వ నిభందనల ప్రకారం పురుషులు పంచె, కండువాతో రావాలని, నగదు తీసుకొని రావద్దని ఉప కమిషనరు తెలిపారు.



# ఉద్యోగ కల్పనే ముఖ్యమంత్రి ధ్యేయం

***మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి..***

**హిందూపురం /(పుట్టపర్తి) (తెలుగోడు), మార్చి 15 :** చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వాలన్నది దే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని రాష్ట్ర ఐటీ,సమాచార పౌర సంబంధాలు, ఎన్ ఆర్ ఐ,తెలుగు సాంస్కృతిక ,మైనార్టీ శాఖల మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. హిందూపురం సప్తగిరి డిగ్రీ కళాశాలలో ఆదివారం హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ సౌజన్యంతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మరియు సి ఈ ఐ ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ జాబ్ మేళాకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు హిందూపురం ఎంపీ పార్థసారథి ,జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ,ఇతర కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు డైరెక్టర్లులతో కలసి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల కలపని ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,రాష్ట్ర ఐటీ , విద్యాశాఖ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక జాబ్ మేళా ను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్నారని వెల్లడించారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతో ప్రముఖ కంపెనీల్లో సుమారు 5000 మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఈరోజు భారీ జాబ్ మేళాను ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే బాలకృష్ణను కొనియాడుతూ మాజీ మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి జిల్లాలో ఎన్నో అంతర్జాతీయ పేరుగాంచిన కియా వంటి కార్ల పరిశ్రమతో పాటు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల వేలాది మందికి ఉద్యోగాలు రావడానికి ఏ మాత్రం కొదవ లేదన్నారు. అయితే నిరుద్యోగ యువతీ యువకులు ఆయా రంగాల్లో వృత్తి విద్యల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు అంతేకాకుండా ఉద్యోగం పొందిన అభ్యర్థులు ఆయా కంపెనీల సూచన మేరకు విధుల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మంచి పేరును సంపాదించుకోవాలని కోరారు. ఉద్యోగం పొందిన యువతీ యువకులు ఆయా రంగాల్లో కష్టపడి పనిచేసి కంపెనీ అభివృద్ధికి తోడ్పాటునిస్తే ఆ వ్యక్తికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలంటే ఉద్యోగం పొందిన కంపెనీల్లో కష్టపడి రాణించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 మాసాల్లోనే ఇప్పటికే లక్షలాదిమందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి యువతీ యువకులను కోరారు. జాబ్ మేళాకు తరలివచ్చిన వివిధ కంపెనీలను ఇక్కడికి వచ్చిన నిరుద్యోగులను మాజీ మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు నిరుద్యోగులు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ఎర్రచందనం రవాణా చట్టరీత్యా నేరం

### 21 దుంగలు స్వాధీనం, వాహనం సీజ్.. ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్..

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 15 :** ఎర్రచందనం అక్రమ రవాణా నేరమని అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలానికి సమీపంలోని స్థానిపాయిరేంజ్ ఆఫీసర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం తెల్లవారుజామున గుండ్లపల్లి సమీపంలో గొల్లపల్లి చెరువు దగ్గర ఒక వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా ఆపకుండా వెళ్లి గొల్లపల్లి చెరువు దగ్గర వాహనాన్ని ఎర్రచందనం దొంగలు రివర్స్ చేయుటకు ప్రయత్నించి గుంతలోకి దింపి పారిపోవడం జరిగిందన్నారు. అందులోని 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి బరువు 612 కేజీలు కాగా, దుంగలతో పాటు వాహనం విలువ సుమారు రూ.6 లక్షలుగా నిర్ధారించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ అధికారులు

తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్ బాబు, అంజన స్వాతి, వెంకటేశ్వర్లు బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా తరలిపోతున్న రేషన్ బియ్యం

### తెలియనట్టు వ్యవహరిస్తున్న అధికారులు ..

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 15 :** పేదల కడుపు నింపాల్సిన ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్క దారి పడుతోంది.. వ్యవహారం అంతా తెలిసినా సంబంధిత అధికారులు తెలినట్టు వ్యవహరిస్తున్నారు. నాటి ప్రభుత్వం నుండి నేటి ప్రభుత్వం వరకు ఎదేచ్చాగా కొందరు వ్యక్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి వీధి వీధికి తిరుగుతూ పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని పడి అంటూ ( దాదాపు మూడు కిలోలు పట్టే పాత్రను) ఎక్కువ మొత్తాన్ని డబ్బులు ఆఫర్ చేస్తూ పేద ప్రజలు మభ్యపెడుతూ బియ్యాన్ని సేకరిస్తున్న మాఫియా ముఠాకు అధికారుల నిర్లక్ష్యంతో విచ్చలవిడిగా రేషన్ బియ్యం సేకరణలో నిమగ్నమయ్యారు. ఎందుకంటే ఆదివారం స్థానిక పాత బస్టాండ్ ఆవరణంలో ఓ ఆటోలో వివిధ గ్రామాల నుండి సేకరించిన రేషన్ బియ్యన్నీ ఆటోలు లోడ్ చేస్తూ కనిపించింది. అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సంఘటన చూసి మండలంలో అధికారులు ఉన్నారా లేరా అనే తరహాలో మాట్లాడు కుంటూ వెళ్తూ ఉండడం గమనార్హం. ఎందుకంటే మండల పరిధిలో ఏఆర్ఏ వీఆర్ఏలు రెవిన్యూ ఉన్నతాధికారులు పోలీసులు



ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

అందరూ ఎవరో ఒకరికి ఈ విషయం తెలిసి ఉంటుంది ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ సంఘటన చూసిన ప్రజలు వాపోతున్నారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**అమరాపురం (తెలుగోడు), జనవరి 15 :** మడకశిరలో అమరాపురం గ్రామానికి చెందిన జామియా మసీద్ ముత్తవల్లి ఫక్రుద్దీన్ సాబ్ ,మదీనా మసీద్ ముత్తుపల్లి బుడెన్ సాబ్, వ్యవసాయ



ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును సన్మానిస్తున్న అమరాపురం ముస్లిం సోదరులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అమరాపురం ముస్లిం సోదరులు

సహకార సంఘం డైరెక్టర్ దాదా పీర్ , దూద్ పేరా, నిషాద్, వజీర్ సాబ్,, జె బి ఉల్లా, అబ్దుల్లా, బాబా తదితరులకు చింతపండు ఆంజనేయులు ఇంటి ఆవరణలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇఫ్తార్ విందు భోజనం నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెస్ రాజు కు ముస్లిం సోదరులు శాలువాలు, పూలమాలతో సన్మానం చేశారు.

# తగ్గుపర్తిలో వైభవంగా శ్రీ సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ

### పూజల్లో పాల్గొన్న టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు..

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 15 :** బెళుగుప్ప మండలం పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా శ్రీ సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలలో భాగంగా ఆదివారం బ్రహ్మ ముహూర్తమున అత్యంత భక్తిశ్రద్ధలతో, వేదమంత్రోచ్చారణల మధ్య, యంత్ర ప్రతిష్ట, అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన , విగ్రహాలంకరణ, బలి, పూర్ణాహుతి,కక్షజ్వాల, అమ్మవారి దర్శనం భక్తులకు తీర్థ,ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరులు టిడిపి నేత పయ్యావుల శ్రీనివాసులు పాల్గొన్నారు.టీడీపీ నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పయ్యావుల శ్రీనివాసులకు ఘన స్వాగతం పలికారు. పయ్యావుల



తగ్గుపర్తి గ్రామంలో శ్రీ సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, అమ్మవారి ఊరేగింపు

శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రికి భజన కార్యక్రమాలు నిర్వహించారు..



తగ్గుపర్తి గ్రామంలో శ్రీ సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా పూజల్లో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్ సోదరులు టిడిపి నేత పయ్యావుల శ్రీనివాసులు

# పంచ సూత్రాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయం

### నేటి నుండి రైతన్న ఇంటికే అధికారులు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ..

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 15 :** నేటి నుండి పంచ సూత్రాల పథకంతో వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు రైతుల ఇంటికే వెళ్లి వ్యవసాయాన్ని ఎలా అభివృద్ధి బాటలో



నడిపించుకోవాలో వివరిస్తారని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి 18 తేదీ వరకు అలాగే 23 నుండి 25 వ తేదీ వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సూచనల ప్రకారం గ్రామాల్లో ఉన్న రైతు కుటుంబాలను స్వయంగా వారి ఇంటివద్దకే వెళ్లి వ్యవసాయ శాఖ రూపొందించిన 5 పంచ సూత్రాల గురించి వివరించడం జరుగుతుంది అన్నారు.ఇందులో ముఖ్యంగా నీటి భద్రత,డిమాండు ఆధారిత పంటలు సాగు చేయడం,అగ్రిటెక్,ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ నుండి పూర్తి మద్దతు మొదలగు అంశాల గురించి వివరించి చర్చించేందుకు ప్రతి రైతు కుటుంబం ఇంటికి వెళ్లి 15 నుండి 20 నిమిషాల పాటు బృందం(టీం) సభ్యులు సమయం కేటాయిస్తారని తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో సచివాలయ పరిధిలో పని చేస్తున్న రైతు సేవా కేంద్ర సిబ్బంది, పశుసంవర్ధక సిబ్బంది,ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్,అభ్యుదయ రైతులు, పకృతి వ్యవసాయ సిబ్బంది,సహకార సంఘం సభ్యులను టీం మెంబెర్స్ గా ఏర్పడి 3 బృందాలుగా విడిపోయి రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి పై విషయాల గురించి సవివరంగా చర్చించి అవగాహన కల్పిస్తారు అన్నారు.కావున రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతు సోదరులు కూడా స్వచ్ఛందముగా పాల్గొనాలి అన్నారు. గ్రామాల్లోకి వచ్చిన బృందం సభ్యులకు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి రైతులకు సూచించారు.

# అవగాహన ర్యాలీకి తరలిరండి

### మండల నాయకులు పిలుపు
### మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న.. సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి.. ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ రామక్రిష్ణ .. మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్..





**రొళ్ల (తెలుగోడు), జనవరి 15 :** మడకశిర పట్టణంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బైక్ ర్యాలీ కి మండలం నుంచి నాయకులు విద్యార్థులు యువకులు అధిక సంఖ్యలో తమ తమ ద్విచక్ర వాహనాలు, హెల్మెట్లతో తరలిరావాలని మండల పార్టీ కన్వీనర్ జి కె ఈరన్న, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ ం పిలుపునిచ్చారు. మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు మాజీ శాసనమండలి సభ్యులు, టి.డి.పి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో "డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్ఫలితాలు, హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే నష్టాలపై సోమవారం సాయంత్రం 03.30 గంటలకు మడకశిర పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నాట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ శ్రీ ఏ.శ్యామ్ ప్రసాద్ , శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్,ప్రముఖ సినీ స్టార్ హీరో విష్ణు ప్రముఖ సినిమా హీరోయిన్ కుమారి,.అనన్య నాగళ్ల, ప్రముఖ సినీ నటులు కారుమంచి రఘు హాజరుకానున్నాట్లు తెలిపారు. ఇందులో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీని (బైక్ ర్యాలీ) మధ్యాహ్నం 3.00 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి మహాత్మా జ్యోతిబాపూలే సర్కిల్ (అమరాపురం బస్టాండ్) వరకు నిర్వహించి అనంతరం అక్కడే అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా యువకులు, విద్యార్థులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. బైక్ ర్యాలీకి ద్విచక్రవాహనంతో పాటు హెల్మెట్ ను ధరించి రేపు మధ్యాహ్నం 03.00 గంటలకు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.





# హెరిటేజ్‌కు కానుక కరువు ప్రాంత పరిశ్రమలకు కోత!



కేవలం 30 మంది పనిచేయగలిగిన మిల్క్ ప్రాసెసింగ్ టెక్నాలజీ అప్డేట్, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ కి నిన్న జరిగిన క్యాబినెట్ లో 200 కోట్లు ఇచ్చేందుకు పచ్చ జెండా ఊపి,విద్యుత్తు రాయితీ యూనిట్ కు రూపాయి చొప్పున నూరు కోట్లు,ఐదేళ్లపాటు మూడు శాతం ఎస్జిఎల్టి రీఎంబర్స్మెంట్ ఇవ్వాలని తీర్మానం చేశారు. కానీ 2024 ఎన్నికల ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రాంతంలో గల గ్రానైట్,కడప స్లాబ్ పరిశ్రమల యజమానులకు, ఇక్కడి మీావీజు లకు,దళిత పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరములు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీలేదు.ఇవ్వకపోగా గత వైసిపి ప్రభుత్వం కంటే ఎక్కువగా ఈ పరిశ్రమలకు కరెంట్ బిల్లులు,రాయల్టీ పెంచడం,అనధికార చెక్ పోస్టులను పెట్టడం వల్ల పరిశ్రమలు మూతపడ్డాయి. మరి లోకేష్ తమ కుటుంబ కంపెనీ అయిన హెరిటేజ్ కు కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చుకుని కరువు ప్రాంతమైన తాడిపత్రి పరిశ్రమలకు రాయితీలు ఇవ్వకపోవడం ఏమిటని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీటిని ప్రోత్సహించడం వల్ల కరువు సీమలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చు, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచవచ్చు. కారు చౌకగా భూములను అమ్మేస్తూ, సొంత కంపెనీలకు మాత్రమే రాయితీలు ఇస్తూ, సొంత మీడియాలో ప్రకటనల రూపంలో వేలకోట్ల ప్రజాధనాన్ని దొబ్బేస్తుంటే మధ్యస్థంగా ఉన్న ప్రజల కంపెనీలను,పరిశ్రమలను మైన్సును మూతపడేలా చేస్తూ సామాన్య ప్రజల బ్రతుకు మీద భరోసా లేకుండా చేస్తున్నారు. ఏమిరా బాలరాజు నీవల్ల వలన ఉపయోగం అన్నట్లు,ప్రైవేట్ ట్రావెల్స్,మైన్స్, ప్రైవేట్ హాస్పిటల్స్,ప్రైవేటు విద్యాసంస్థలు కూడా రాయితీలు ఇవ్వవచ్చు కదా ఏమిటి లోకేష్ నీ వల్ల ఉపయోగం అంటున్నారు. మీ బంధువులకు,మీ బినామీ వ్యాపారులకు 90 పైసలకే వేల ఎకరాల భూములు,ఇచ్చి, శ్రీలంక నేపాల్ మరియు పాకిస్థాన్ రాజకీయ నాయకులు మాదిరి సంపాదించి,ఆ అవినీతి డబ్బులు విదేశాల్లో భద్రంగా దాచుకొని,మీ కుటుంబాలు వేరే దేశాలకు వెళ్ళిపోండి లేకపోతే శ్రీలంక,నేపాల్ లో లాగా ప్రజా చైతన్యం వచ్చి, మీకు కూడా అదే గతి పట్టే కాలం ఎంతో దూరం ఉండదు.

***– కె.వి. రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వెలుగుబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.***

# పండుగ పూట ముస్లిం సోదరుల నోటి వద్ద ముద్ద లాగిన జగన్

### పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ తరఫున రంజాన్ తోఫా పంపిణీ.. ఎమ్మెల్యే పరిటాల సునీత..

**ఆత్మకూరు (తెలుగోడు), మార్చి 15 :** ముస్లిం సోదరులు అతి పెద్ద పండుగగా జరుపుకునే రంజాన్ రోజు వారి నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఆమె రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు మండల కేంద్రంలోని కనకదాస కళ్యాణమండపంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మైనార్టీ నాయకులకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా సుమారు 200 కుటుంబాలకు, 8రకాల వస్తువులతో రంజాన్ తోఫా అందజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న రెండు మసీదుల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీతకు స్థానిక మైనార్టీ నాయకులు, మతపెద్దలు ఘన స్వాగతం పలికారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు అందజేసి దీక్షలు విరమింపజేశారు. ఆ తర్వాత ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా వారికి భోజనం వడ్డించారు. ఉదయం రాప్తాడు మండలం చిన్మయనగర్ కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాష అతని మిత్రుల ఆధ్వర్యంలో అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. 2వందల ముస్లిం కుటుంబాలకు 6రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా కిట్ ను సునీత అందజేశారు. రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన మైనార్టీ నాయకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముస్లింలు అత్యంత పవిత్రంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

జరుపుకునే పండుగ రంజాన్ అని అన్నారు. తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే రంజాన్ తోఫాను ప్రారంభించామన్నారు. అప్పుడు ఆ కానుక అందిస్తున్నప్పుడు ముస్లింల కళ్లలో ఆనందం చూశామన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేసినప్పుడు ముస్లిం సోదరులు ఎంతో ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక



పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందించిన ఎమ్మెల్యే సునీత

మళ్లీ మైనార్టీల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మరోసారి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని పునఃప్రారంభించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆత్మకూరు మండలం కేంద్రంలోని మసీదుల్లో సమస్యల పరిష్కారం కూడా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో తాగినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించబోతున్నామని ప్రతి ఇంటికి కొళాయి వస్తుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

# గ్రూప్ 2లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం సంపాదించిన గంగవరం యువకుడు

**ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నుంచి నియామక పత్రాన్ని అందుకున్న యర్రం వినోద్ కుమార్...**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 15 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన యర్రం వెంకటరమణ కుమారుడు యర్రం వినోద్ కుమార్ గ్రూప్2లో ఉత్తీర్ణత సాధించి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా కొలువుదీరాడు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం సంపాదించిన వినోద్ కుమార్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో యర్రం వెంకటరమణ కూతురు కూడా గ్రూప్-2లోనే ఉద్యోగం సంపాదించడం విశేషం. గంగవరం గ్రామానికి చెందిన యర్రం వెంకటరమణ కొడుకు వినోద్ కుమార్,కూతురు ఇద్దరూ గ్రూప్ 2 లో ఉద్యోగాలు సంపాదించడంతో గంగవరం గ్రామస్తులు వారికి అభినందనలు తెలియజేస్తూ, తల్లిదండ్రులను పొగిడారు.





రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నుంచి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌గా ఉత్తర్వులు అందుకుంటున్న గంగవరం యర్రం వినోద్ కుమార్

# ఆదోనికి తరలి వెళ్లిన బీఎస్పీ నాయకులు

**గుత్తి (తెలుగోడు), మార్చి 15 :**
కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో జరిగిన బిఎస్పి వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నేత కాన్సీరాం జయంతోత్సవాల్లో పాల్గొనటానికి ఆదివారం గుత్తి నుండి బీఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. బిఎస్పి జిల్లా అధ్యక్షుడు గద్దర్ నాగభూషణం జిల్లా నాయకులు వెంకటయ్య గుంతకల్లు నియోజకవర్గం నాయకులు వెంకట కొండయ్య బండల రామాంజనేయులు ల ఆధ్వర్యంలో పలువురు బీఎస్పీ నాయకులు పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద నుండి ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలో రాజకీయ అవగాహన కలిపి రాజ్యాధికార సాధన లక్ష్యంగా ముందుకు సాగాలని అనేక పోరాటాలు చేసి బహుజనుల స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మాన్య శ్రీ కాన్సిరాం ఆశయ సాధనకు చైతన్యవంతులను ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు ముందుకు రావాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు డిఎస్పి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు



ఆదోనికి తరలివెళ్తున్న బీఎస్పీ నాయకులు





గుత్తి కోట ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు

# ముగిసిన గుత్తి కోట ఉత్సవాలు

**పాల్గొన్న అతిరథ మహారధులు..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 15 :**
పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా కన్నుల పండువగా గుత్తి కోట ఉత్సవాలు - 2026 ముగింపు వేడుకలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచి జరిగిన గుత్తి కోట ఉత్సవాలలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో ముందుగా అనంతపురం శ్రీ నృత్య కళానిలయం గురు ఎస్ఎంటి సంధ్యమూర్తి టీం నిర్వహించిన శివపాదం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం జబర్దస్త్ డా.శాంతికుమార్, రైజింగ్ రాజు, మోహన్.. మిమిక్రీ నవ్వులు పూయించి అందరిచేత చప్పట్లు కొట్టించారు. అనంతపురం శ్రీ నృత్య కళానిలయం గురు ఎస్ఎంటి సంధ్యమూర్తి టీం రాయలసీమ ఫోక్ డ్యాన్స్ విశేషంగా అలరించింది. అనంతరం టూరిజం ఏవిలను ప్రదర్శించారు. అనంతపురం ఎస్టీ.అగస్ట్రన్ స్కూల్ వారి గంగమ్మ జాతర, హర్యానా ఫోక్ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండుగగా సాగాయి. రెండు రోజులు పాటు జరిగిన ఉత్సవాలను తిలకించడానికి గుత్తి గుత్తి అరెస్టు పాటు వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయడంలో ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహించి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మృతి సీఐ రామారావు ఎస్సైలు సురేష్ తదితరులు బందోబస్తు చర్యలు చేపట్టారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తెలుసుకున్నారు



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్





# నేటి నుండి "రైతన్న మీకోసం"

**మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్..**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 15 :**
రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరము ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ముందస్తు సన్నద్ధంలో భాగంగా నేడు (ఈనెల 16 నుండి 25 వరకు) రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ప్రతి రోజు 90 రైతు కుటుంబాలను సందర్శించి ఖరీఫ్ సన్నద్ధతను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతుకు ఎల్ ని నో,వర్షా బావ పరిస్థితిలు - ప్రభావం, ప్రకృతి వ్యవసాయం సేద్యం- సుస్థిర సాగు ప్రత్యామ్నయం వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఈనెల 25వ తారీఖున గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో రైతులు నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.



# రంజాన్ మాసంలో టిడిపి నాయకుల సేవా గుణం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 15 :**
పవిత్రమైన రంజాన్ మాసంలో టిడిపి నాయకులు సేవా గుణాన్ని చాటుకుంటున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రాజీవ్ కాలనీలోని ప్రియాంక నగర్ లో టిడిపి నేత లింగమయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు పాల్గొన్నారు. కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికంగా ఉన్న టిడిపి నాయకులు ముస్లిం సోదరులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి తెలుగు మైనార్టీ పక్షపాతిగా ఉంటుందన్నారు. తమ పార్టీ నేతలు కూడా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందులు, రంజాన్ తోఫాలు అందజేస్తున్నారన్నారు. మత సామరస్యాన్ని చాటే విధంగా నాయకులు కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.



# గౌరవానికి మంగళం.. వేతనానికి తిలోదకం!

**పేరుకే ప్రజాప్రతినిధులు..**
**తీరుకేమో ఉత్సవమూర్తులు ..**
**నిధులు, పనులు,**
**వేతనాలు లేని ప్రాతినిధ్యం ..**
**ప్రాదేశిక సభ్యులకు అందని**
**రూ.66.60 లక్షల గౌరవ వేతనం..**
**ఉత్సవ విగ్రహాల్లా జడ్పిటిసి. ఎంపీపీ ఎంపీటీసీలు..**



**యాడికి (తెలుగోడు), మార్చి 15 :**
పల్లెలను ఆర్థికంగా, సామాజికంగా పరిపుష్టం చేయడంలోనూ, అబివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, అధికార యంత్రాంగాన్ని ప్రజలకు జవాబుదారీ చేయడంలోనూ, ప్రభుత్వ సేవలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా పర్యవేక్షించడంలోనూ స్థానిక సంస్థల ప్రజా ప్రతి నిధుల పాత్ర ఎంతో కీలకం. అలాంటి ప్రజా ప్రతినిధుల్లో సర్పంచుల తర్వాత ప్రజలకు అతి చేరువగా ఉండేది మండల పరిషత్ ప్రాదేశిక ని యోజకవర్గ( ఎంపీటీసీ) సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు. తాడి పత్రి నియోజ కవర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడు గూరు మండలాల పరిధిలోని 58 ఎంపీటీసీ స్థానాలకు ప్రాతినిధ్యం వహి స్తున్న ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వాల్సిన కనీస గౌరవానికి కూడా అధికారులు మంగళం పాడారని కొందరు ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
రాష్ట్ర ప్రభుత్వంతో ప్రమేయం లేకుండా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక హక్కులు, విధులు ఉన్నాయనే సంగతిని మరిచి పోతున్న అధికారులు ప్రభుత్వం ఏ పార్టీకి చెందిన నాయకుల దైతే ఆ నాయకులనే అనధికార ప్రజా ప్రతినిధులుగా భావిస్తూ వారినే అతిగా గౌరవిస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఆయా సందర్భాల్లో ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు తప్పని సరిగా సరైన హోదా కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ మండల, పంచాయతీ స్థాయి అధికారులు ఎంపీటీసీ సభ్యులను సభావేదికలపైకి ఆహ్వానించడం లేదని ఏకంగా సర్వ సభ్య సమావేశాల్లోనే వారు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు.
మా పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారో ఏయే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారో కూడా కనీస సమాచారం కూడా ఇవ్వలేని దుస్థితిలో స్థానిక అధికారులు ఉండిపోతున్నారని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
నియోజకవర్గంలోని ఎంపీటీసీలు తాడిపత్రి మండలంలో 19 మంది, యాడికిలో 16 మంది, పెద్దవడుగూరులో 13 మంది, పెద్దపప్పూరు లో 10 మంది చొప్పున 58 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి 2024 ఆగస్టు నెల నుంచి నేటి వరకు అంటే దాదాపు 30 నెలలుగా గౌరవ వేతనమే దక్కలేదు. ఒక్కో ఎంపీటీసీ సభ్యునికి నెలకు రూ.3 వేలు చొప్పున 30 నెలలకు రూ.90 వేలు వంతున 58 మందికి రూ.52.20 లక్షలు అందాల్సి ఉంది. ఇక ఎంపీపీలకు నెలకు రూ.6 వేల వంతున 30 నెలలకు రూ. 1.8 లక్షల చొప్పున నాలుగు మండలాల ఎంపీపీలకు ఇప్పటి వరకు రూ.7.20 లక్షలు అందాల్సి ఉంది.
అదే రీతిన నాలుగు మండలాల జడ్పీటీసీ సభ్యులకు కూడా నెలకు రూ. 6 వేల వంతున 30 నెలలకు రూ.1.8 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.7.20 లక్షలు రావాల్సి ఉంది. ఆ లెక్కన నియోజకవర్గంలోని మొత్తం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు, ఎంపీపీలకు కలిపి రూ. 66.60 లక్షలు గౌరవ వేతనం అందాల్సి ఉంది. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య కావడంతో ఉన్నతాధికారులు స్పందించి త్వరలో పదవీ కాలం ముగియనున్న తమకు తగిన గౌరవం దక్కక పోయినా కనీసం గౌరవ వేతన మైనా దక్కేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రాదేశిక సభ్యులు కోరుతు న్నారు. తమ వేతనాన్నే సాధించుకోలేక పోయిన ప్రాదేశిక సభ్యులు తమకేమీ చేస్తారని ప్రజలు అపోహపడే ప్రమాదముందని వారు అభిప్రాయ పడుతున్నారు.

# రైతు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

**గుత్తి (తెలుగోడు), మార్చి 15 :**
పట్టణంలోని బీసీ కాలనీలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏడవ మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్య ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి హాజరయ్యారు .ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలం నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను కర్తవ్యాలను రూపొందించుకొని వాటి అమలు కోసం రానున్న మూడు సంవత్సరాల కాలం పాటు ఆందోళన పోరాటాలు దశలవారీగా నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రధానంగా వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం చేసి 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు 6000 పెన్షన్ సౌకర్యం ఇవ్వాలని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వ్యవసాయ కార్మికులకు చేతినిండా పనులు కల్పించాలని పనులకు తగ్గ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పకడ్బందీగా అమలు చేసి ప్రతి జాబు కార్డుకు ?200 రోజులు బాద్ పనులు కల్పించాలని రోజు వేతనము 600 ఇవ్వాలని గుత్తి పట్టణంలో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి మూడు సెంట్లు ఇంటి స్థలం ఇల్లు ఐదు లక్షలతో ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలన్నారు గ్రామాల్లో సాగు భూమి లేని పేదలకు భూ పంపిణీ ద్వారా రా ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు సాగుభూమి ఇవ్వాలన్నారు వ్యవసాయ కార్మికుల వలసలు నివారించాలన్నారు వలస కార్మికులకు సమగ్రమైన చట్టం చేసి వలస కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు . పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు ఉచితంగా ఇవ్వాలన్నారు స్థానిక సమస్యలు మంచినీళ్లు రోడ్లు వీధిలైట్లు మహిళలకు సంవత్సరానికి 18000 రూపాయలు వెంటనే అమలు చేయాలన్నారు పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని అందరికీ గ్యాస్ అందుబాటులో ఉండే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు నిర్మల రామకృష్ణ రేణుక మల్లికార్జున తో పాటు పలువురు సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు






వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు. పాల్గొన్న కార్యకర్తలు



# ఉస్తాద్ ట్రైలర్‌కు మెగా ఫ్యామిలీ ఫిదా

## చిరంజీవి, రామ్ చరణ్ ప్రశంసలు




పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా ట్రైలర్ విడుదలయ్యాక సినీ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. శనివారం విడుదలైన ఈ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగులు, ఆయన ప్రత్యేకమైన స్టైల్ ట్రైలర్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ముఖ్యంగా "ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం.." అంటూ పవన్ చెప్పిన డైలాగ్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదలైన వెంటనే మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో స్పందిస్తూ తన సోదరుడు పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ట్రైలర్ చాలా ఆకట్టుకునేలా ఉందని, ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ నటన, ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను మరింత ఉత్సాహపరుస్తుందని పేర్కొన్నారు.

అలాగే రామ్ చరణ్ కూడా ట్రైలర్‌పై తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ట్రైలర్ అద్భుతంగా ఉందని, పవన్ కళ్యాణ్ ఎనర్జీ, స్టైల్ చాలా గొప్పగా కనిపించాయని ప్రశంసించారు. దర్శకుడు హరీష్ శంకర్ పవన్ కళ్యాణ్‌ను అద్భుతంగా ప్రెజెంట్ చేశారని పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా ఈ సినిమా సందడి మరింత పెరుగుతుందని, అభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పారు.

ఈ ట్రైలర్ విడుదలైన తర్వాత సినీ రంగానికి చెందిన పలువురు దర్శకులు, నటులు కూడా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేకమైన స్టైల్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయని పేర్కొంటున్నారు. మొత్తంగా "ఉస్తాద్ భగత్ సింగ్" ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమా మీద ఉన్న అంచనాలను మరింతగా పెంచుతోంది.

# ముగ్గురు చిన్నారులకు అండగా శ్రీలీల



అద్భుతమైన డ్యాన్స్‌లతో థియేటర్లను హోరెత్తించే యువ సినీతార శ్రీలీలలో ముగ్గురు చిన్నారుల బాధ్యతను భుజాన వేసుకున్న ఒక సామాజిక యోధురాలు దాగి ఉంది. కేవలం ఇరవై ఒకటేళ్ల ప్రాయంలోనే మాతృత్వపు లోతును అర్థం చేసుకున్న ఆమె ప్రయాణం ఇప్పుడు చిత్రసీమలో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు భారీ చిత్రాల షూటింగ్‌లు, మరోవైపు సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది ఆమె.

తన బిజీ జీవితంపై మాట్లాడుతూ చాలామంది షూటింగ్‌లు, డ్యాన్స్ ప్రాక్టీస్‌లు, నిరంతర పనులతో బోర్ కొట్టదా అని అడుగుతుంటారని చెబుతోంది. కెమెరా ముందు చేసే పని తన వృత్తి అయితే, కెమెరా వెనుక అసలైన ప్రశాంతత మాత్రం ఆ ముగ్గురు పిల్లల దగ్గరే దొరుకుతుందని ఆమె భావిస్తోంది. ప్రస్తుతం తన వయసు ఇరవై నాలుగు సంవత్సరాలు కాగా, ఇరవై ఒకటేళ్ల వయసులోనే దివ్యాంగులైన ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుందని వెల్లడించింది. ఇటీవల మరో చిన్నారిని కూడా తన సంరక్షణలోకి తీసుకుందని తెలిపింది.

వారు తనతో ఒకే ఇంట్లో ఉండకపోయినా వారి తిండి, బట్టలు, చదువు, ఆరోగ్యం వంటి ప్రతిదీ తన పర్యవేక్షణలోనే జరుగుతుందని చెప్పింది. సమయం దొరికినప్పుడల్లా వారిని కలుస్తానని, ఆ పిల్లల కళ్లలో కనిపించే ఆనందం ముందు కోట్లాది రూపాయల పారితోషికం కూడా ఏమాత్రం విలువకాదని ఆమె భావించింది. తాను చేసిన ఈ పని గురించి ఎక్కడా గొప్పలు చెప్పుకోవాలనే ఉద్దేశం లేదని, అది తన ఆత్మసంతృప్తి కోసం చేసినదేనని తెలిపింది. వారు తనను తల్లి అని పిలవాలని కూడా కోరుకోవడం లేదని, వారికి ఒక అక్కలా అండగా ఉంటే చాలని పేర్కొంది.

సినిమా రంగంలోకి వచ్చినప్పుడు విమర్శలకు సిద్ధంగా ఉండాల్సిందేనని ఆమె చెప్పింది. అయితే టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ వికృత చేష్టలు కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల తన ఫోటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడం చూసి బాధపడ్డానని తెలిపింది. ఒక నటిగా ధైర్యంగా ఉన్నా, ఒక మహిళగా ఆ దృశ్యాలు తనను కలచివేశాయని చెప్పింది. టెక్నాలజీని అభివృద్ధికి ఉపయోగించాలి కానీ ఒకరి గౌరవాన్ని దెబ్బతీయడానికి వాడకూడదని ఆమె సూచించింది.

# యూత్ నిర్మాత ధైర్యానికి హ్యాట్సాఫ్.. ధనుష్

చిన్న వయసులోనే ఓ యువకుడు చెప్పిన కథను నమ్మి సినిమా నిర్మించడం పెద్ద సాహసమని, అలాంటి ధైర్యం చూపిన నిర్మాతకు అభినందనలు తెలపాల్సిందేనని ప్రముఖ హీరో ధనుష్ అన్నారు. పాఠశాల బాల్య జీవితం ప్రధానాంశంగా రూపొందిన 'యూత్' చిత్ర ప్రిరిలీజ్ కార్యక్రమం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్, హీరో ధనుష్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. పార్వతా ఎంటర్టైన్‌మెంట్ పతాకంపై నిర్మాత కరుప్పయ్య సి.రామ్ నిర్మించిన ఈ చిత్రానికి నటుడు కెన్ కరుణాస్ దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా కూడా నటించారు. పాఠశాల జీవితంలోని అనుభవాలు, భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో అనిష్మా, మీనాక్షి దినేష్, ప్రియాన్షి యాదవ్ హీరోయిన్లుగా నటించగా దేవదర్శిణి, సురాజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని జీవీ ప్రకాష్ కుమార్ అందించారు.ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. కార్యక్రమంలో మాట్లాడిన దర్శకుడు వెట్రిమారన్, కెన్ కరుణాస్ నటుడిగానూ, దర్శకుడిగానూ తన ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపారు. కెన్‌పై తనకంటే ఎక్కువ నమ్మకం ధనుష్ పెట్టారని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా హీరో ధనుష్ మాట్లాడుతూ, 23 ఏళ్ల యువకుడు చెప్పిన కథను నమ్మి సినిమా నిర్మించిన నిర్మాత కరుప్పయ్య సి.రామ్ ధైర్యాన్ని అభినందించారు. కొత్త ప్రతిభను ప్రోత్సహించడం సినీ పరిశ్రమకు ఎంతో అవసరమని ఆయన అన్నారు. దర్శకుడు, హీరో కెన్ కరుణాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ సినిమాలో నటించిన నటీనటులకు, పని చేసిన సాంకేతిక నిపుణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన దర్శకుడు వెట్రిమారన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తాను హీరోగా పరిచయం కావడానికి కారణమైన దివంగత తామిరకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.